జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శుక్రవారం 22 మే 2026 | సంపుటి : 01 | సంచిక : 297 | పేజీలు : 12 | వెల : 4/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ప్రకటనల ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528


# వామ్మో.. 48 డిగ్రీలు!

- తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రికార్డు స్థాయిలో 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది
- వచ్చే వారం రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం
- ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని సూచన

తెలుగు రాష్ట్రాల్లో రోళ్లు పగిలే ఎండలు..

రికార్డులు బద్దలు కొడుతున్న ఉష్ణోగ్రతలు..

హైయెస్ట్ రిపోర్ట్ చూస్తే మంటలే..



సమ్మర్ హీట్ నెక్ట్స్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్లు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు.

## తమిళనాడు చరిత్రలో ఇదొక టర్నింగ్ పాయింట్



- క్యాబినెట్ బెర్తులు దక్కడంపై కాంగ్రెస్
- తమిళనాడు ప్రభుత్వం క్యాబినెట్ విస్తరణ
- కాంగ్రెస్ నుంచి ఇద్దరికి అవకాశం
- తమ పార్టీ నేతలు అధికారం కోసం విశ్వాసం, అంకితభావంతో గత 59 ఏళ్లుగా పనిచేస్తున్నారన్న హస్తం పార్టీ



282 ప్రాజెక్టులకు ఆమోదం..

## 114 ప్రాజెక్టులు గ్రౌండింగ్

### సీఎం చంద్రబాబుకు వివరించిన మంత్రుల కమిటీ

**అమరావతి**

భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు, ఎస్ఐపీబీలో ఆమోదించిన 282 ప్రాజెక్టులకు గాను 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని సీఎం చంద్రబాబకు మంత్రుల కమిటీ వివరించింది. గురువారం మంత్రుల కమిటీతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీకి ఎంఓయూలు, ప్రాజెక్టుల పురోగతిపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్ఐపీబీల ద్వారా ఇప్పటికి రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామన్న సీఎం. వీటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయినట్టు మంత్రుల కమిటీ ఛైర్మన్ లోకేష్ సీఎం చంద్రబాబుకు వివరించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులతో పాటు ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచనలు చేశారు. సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తే అధినేత



- స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు నిర్వహించేందుకు పొలిట్ బ్యూరో నిర్ణయం
- మహానాడులో 19 తీర్మానాలు చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయం
- ఏపీ-10, తెలంగాణ-4, అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానంపై చర్చ
- ఉమ్మడి తీర్మానాలు-4, రాజకీయ తీర్మానాలపై చర్చ

**అమరావతి**

తెలుగుదేశం మహానాడును ఈసారి "స్త్రీ శక్తి" థీమ్‌తో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకుంటూ, పార్టీ వెన్నుదన్నైన బీసీలకు భరోసా ఇచ్చేలా మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనేది ప్రతిబింబించేలా శ్రేణులందిరినీ భాగస్వాములను చేస్తూ, సరికొత్త ఉత్సాహంతో ఈ వేడుకను పండుగలా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో "మహానాడు-2026" నిర్వహణ ప్రధాన అజెండాగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి "స్త్రీ శక్తి" ప్రధాన థీమ్‌గా 2026 మహానాడును నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు మహిళా సంక్షేమం, సాధికారత కోసం దేశంలోనే ఆదర్శంగా - మిగతా3లో



ఇరాన్‌పై దాడి చేయాలా..

## శాంతి చర్చలా..?

- ట్రంప్, నెతన్యాహు మధ్య విభేదాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన సంగతి తెలిసిందే
- ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది
- శాంతి చర్చలు ఎటూ తేలడం లేదు.

# ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్

- చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్తులో ఏపీకి రాజధాని నీలినీడలు
- బాబు ష్యూరిటీ-- మోసం గ్యారంటీ
- రెండేళ్ల ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తే అత్యంత ఘోరం
- 'మావిగన్' అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉంది
- ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ జంగిల్ రాజ్‌గా రాష్ట్రాన్ని మార్చారు
- మీడియా సమావేశంలో వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్



**అమరావతి**

చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్తులో ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ రెండేళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు పలానా మంచి చేశానని చెప్పుకునే పరిస్థితి చంద్రబాబుకు ఏ కోశానా లేదు. బాబు ష్యూరిటీ-- మోసం గ్యారంటీ, అన్నదాన్ని ప్రతిరోజూ రుజువు చేస్తూనే ఉన్నాడు. ఈ మధ్యకాలంలో చంద్రబాబు బీపీకి కారణం, మావిగన్. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళుతున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దష్ట్యా - మిగతా3లో




## 60 రోజుల్లో ఉద్యోగం తెచ్చుకోండి

- లేదంటే దేశం విడిచి వెళ్లండి..
- అమెరికాలో హెచ్1బి గండం
- అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు
- అమెరికాలో ఎదగాలని ఆశలు పెట్టుకున్న ఎంతోమంది భారతీయులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు

# పట్టణ ప్రాంతాల్లో రింగ్‌రోడ్లు, బైపాస్‌లు


- ఏపీలో రూ.1,990 కోట్ల విలువైన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- నాలుగు కీలక పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఈ ఫండ్ ద్వారా మొత్తం రూ.497.71 కోట్ల కేంద్ర సాయం మంజూరు
- విశాఖ, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రాజెక్టులకు ఆమోదం



**అమరావతి**

రాష్ట్రంలో రూ.1,990.83 కోట్ల విలువైన అర్బన్ చాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం తెలిపిందని మంత్రి నారాయణ తెలిపారు. నాలుగు కీలకమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ఫండ్ ద్వారా మొత్తం రూ.497.71 కోట్ల కేంద్ర సాయం మంజూరు చేసిందన్నారు. విశాఖపట్నం, మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లలో ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద నాలుగు ప్రాజెక్టులకు ఆమోదం రావడం రాష్ట్రానికి గొప్ప గుర్తింపు అని - మిగతా3లో

# వామ్మో.. 48 డిగ్రీలు!



సమ్మర్ హీట్ నెక్స్ట్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్ళు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు. రానున్న వారం రోజులపాటు ఇలానే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అత్యవసరం అయితే ఇళ్ల నుంచిబయటకు రావొద్దని సూచిస్తున్నారు. వచ్చే వారం రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయిలో పెరుగుతుందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు అలర్ట్ జారీ చేశారు.

**పిడుగురాళ్లలో గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు**

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం వరకు ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. గురువారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు నమోదైందని, 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకుగాను 20 జిల్లాల పరిధిలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పల్నాడు జిల్లాలో 26, ప్రకాశం 23, కృష్ణా 22, ఏలూరు 21, బాపట్ల 20, ఎన్టీఆర్ 15, గుంటూరు 14, మార్కాపురం 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందని పేర్కొన్నారు. తెలంగాణలో 45 డిగ్రీలు ఉష్ణోగ్రతలు దాటాయి.. ఖమ్మం జిల్లా ఏడూళ్ల బయ్యారంలో 46.2 డిగ్రీలు, రామగుండంలో 44.6, నిజామాబాద్‌లో 44.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. రానున్న 5 రోజులు తెలంగాణలో నిప్పుల వర్షమేనని జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**ఏపీ డిజాస్టర్ మేనెజ్‌మెంట్ హెచ్చరికలు**

అలాగే శుక్రవారం(22-05-2026) 15 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 219 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతల నమోదైయ్యే మండలాల పూర్తి వివరాలు : ఈ లింక్‌ను క్లిక్ చేయండి..

రాబోవు రెండు రోజులు క్రింద విధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉన్నట్లు ఏపిఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు

**మే 22 శుక్రవారం**

అల్లూరి సీతారామరాజు, పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 - 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

కాకినాడ,నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 43- 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, విశాఖ పట్నం, అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 -- 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

**మే 23 శనివారం**

పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 -- 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. కాకినాడ, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44- 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకాళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 -- 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. గురువారం పల్నాడు(జి) పిడుగురాళ్లలో 48.1డిగ్రీలు, బాపట్ల(జి) వేటపాలెం, కృష్ణా(జి) నందివాడ 47.6, ఎన్టీఆర్ (జి) తొర్రగుడిపాడు, ప్రకాశం(జి) అద్దంకిలో 47.4, ఏలూరు(జి) అల్లిపల్లిలో 47.3, మార్కాపురం(జి) నందనమారెళ్లలో 46.6, పోలవరం(జి) కూనవరంలో 46.5, నెల్లూరు(జి) కావలిలో 46.4, గుంటూరు(జి) తెనాలిలో 46, తూర్పుగోదావరి(జి) బ్రహ్మణగూడెంలో 45.8, పశ్చిమ గోదావరి(జి) తాడేపల్లిలో 45.5, విశాఖ(జి) ములగాడలో 45.2, అనకాపల్లి(జి) మాకవరపాలెం, కోనసీమ(జి) రామచంద్రాపురం, తిరుపతి(జి) బోనుపల్లెలో 45.1, కాకినాడ(జి) కందరాడ, విజయనగరం(జి) గుర్లలో 45 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మరోవైపు ఉపరితల ఆవర్తన ప్రభావంతో అల్లూరి, పోలవరం, నెల్లూరు రాయలసీమలో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదన్నారు.

# తమిళనాడు చరిత్రలో ఇదొక టర్నింగ్ పాయింట్



గత 59 ఏళ్లుగా విశ్వాసంతో పనిచేస్తున్న హస్తం పార్టీ కార్యకర్తలకు జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కడం ఒక వరంగా అభివర్ణించింది కాంగ్రెస్. అధికారం కోసం విశ్వాసంతో, అంకితభావంతో ఇన్నాళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడుతున్నారని పేర్కొంది. ఇప్పుడు వారికి అధికారం దక్కిందని వెల్లడించింది. తమిళనాడు రాజకీయ చరిత్రలో దీన్నొక మలుపుగా అభివర్ణించింది. విజయ్ క్యాబినెట్‌లో తమ పార్టీకి చెందిన ఇద్దరికి మంత్రి పదవుల దక్కిన నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి ఏఐసీసీ ఇన్‌చార్జ్ గిరీశ్ చోడంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "తమిళనాడు ప్రజల తీర్పు సంకీర్ణ ప్రభుత్వానికి ఉన్న మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. అధికారంలో వాటా కోసం మా కార్యకర్తలు పోరాడుతున్నారు. ఈ రోజు కాంగ్రెస్ కార్యకర్తలకు అధికారం దక్కింది. తమిళ ప్రజలు లౌకిక, ప్రగతిశీల ప్రభుత్వాన్ని కోరుకున్నారు" అని గిరీశ్ చోడంకర్ పేర్కొన్నారు.

**తమిళనాడులో కోల్పోయిన పట్టును తిరిగి సాధిస్తాం : మాణికం ఠాగూర్**

సంకీర్ణంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ సాధారణంగా అధికారాన్ని పంచుకుంటుందని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అన్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే జరిగిందన్నారు. తాము ఇతరుల విజయం (డీఎంకేనుద్దేశించి) కోసం పనిచేసి, ఎన్నికలు ముగిశాక బయట కూర్చోవాల్సి వచ్చిన ఏకైక రాష్ట్రం తమిళనాడు మాత్రమేనని వెల్లడించారు. తమిళనాడులో కాంగ్రెస్ కోల్పోయిన పట్టును తిరిగి పొందడానికి అధికారం సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. "రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయాలనే వాదనను ముందుకు తీసుకెళ్లడానికి ఇది బలమైన ఊపునిస్తుంది. తమిళనాడు, పుదుచ్చేరిలో ఉన్న మొత్తం 40 ఎంపీ స్థానాలను మేమే గెలుస్తామని మాకు పూర్తి నమ్మకం ఉంది." అని మాణికం ఠాగూర్ తెలిపారు.

**'ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో జోష్‌ని నింపింది'**

అధికారంలో వాటా అనేది కాంగ్రెస్ కార్యకర్తలు పడిన కఠోర శ్రమకు లభించిన గౌరవం, ఆత్మగౌరవానికి సంకేతమని సీనియర్ కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ పరిణామం పార్టీ శ్రేణుల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. 1952 నుంచి తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడలేదన్నారు. అధికారం, పరిపాలనలో తమకు వాటా కావాలని కాంగ్రెస్ కార్యకర్తలు, జిల్లా అధ్యక్షులు, నాయకులు నిరంతరం డిమాండ్ చేస్తూ వచ్చారని గుర్తు చేసుకున్నారు.

**రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేస్తాం : సెల్వపెరుంతగై**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి రోజే కాంగ్రెస్ నేతల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతోందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం రాజ్‌భవన్‌కు వెళ్లే ముందు కాంగ్రెస్ నాయకులు, కాబోయే మంత్రులు ఉదయాన్నే శ్రీపెరుంబుదూర్‌లోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నాన్ని సందర్శించి నివాళులర్పించారని తెలిపారు. తమిళనాడులో భవిష్యత్తులో గెలిచే ఏ కూటమి అయినా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో ఉన్న 40 స్థానాలకు గెలుచుకుని, 100 శాతం స్ట్రైక్ రేట్‌ను నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు, విజయ్ క్యాబినెట్‌లో మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎస్. రాజేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. క్షేత్రస్థాయి పార్టీ కార్యకర్తల ఆకాంక్షలను నెరవేర్చడమే తన ప్రధాన బాధ్యతని పేర్కొన్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత తమ కార్యకర్తల ప్రగాఢ ఆకాంక్ష నెరవేరిందన్నారు. తాగునీరు, రోడ్లు, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు వంటి ప్రాథమిక సమస్యలపై తాను ప్రధానంగా దృష్టి సారిస్తానని వెల్లడించారు.

**టీవీకే కూటమి చెక్కుచెదరలేదు**

**మంత్రి ఆధవ్ అర్జున**

రాష్ట్ర మంత్రివర్గం ఒకే కుటుంబంలా పనిచేయాలని, ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలన్నింటికీ తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఆకాంక్షించారని టీవీకే నేత, రాష్ట్ర మంత్రి ఆధవ్ అర్జున పేర్కొన్నారు. టీవీకే నేతృత్వంలోని కూటమి చెక్కుచెదరకుండా ఉందని, త్వరలో మరి కొందరికి క్యాబినెట్ బెర్తులు దక్కుతాయని వెల్లడించారు.

**విజయ్ క్యాబినెట్ విస్తరణ**

ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండు వారాల తర్వాత విజయ్ తన మంత్రివర్గాన్ని గురువారం విస్తరించారు. ఈ క్రమంలో టీవీకేకి చెందిన 21 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు (రాజేశ్ కుమార్, విశ్వనాథన్) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. దీంతో విజయ్ మంత్రి వర్గం సంఖ్య 33కు చేరింది.

**రాహుల్, రాజీవ్‌పై ప్రశంసలు- గవర్నర్ అభ్యంతరం**

మరోవైపు, కాంగ్రెస్ నేత రాజేశ్ కుమార్ తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆ పార్టీ నాయకులైన కామరాజ్, రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీలను ప్రశంసించారు. దీనిపై గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలు మీ ప్రమాణంలో భాగం కాదని రాజేశ్‌కు తెలియజేశారు. పేపర్‌పైన ఉన్న లిఖిత ప్రమాణానికే కట్టుబడి ఉండాలని సూచించారు.

**మంత్రులకు శాఖలు కేటాయింపు**

అలాగే కొత్త మంత్రులకు విజయ్ శాఖలను కేటాయించారు. కొన్ని మంత్రిత్వ శాఖలను పునర్ కేటాయించారు. శాఖల కేటాయింపునకు గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆమోదం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రాజేశ్ కుమార్‌కు టూరిజం, విశ్వనాథన్‌కు ఉన్నత విద్యా శాఖను కేటాయించారు. టీవీకే నేత మేరీ విల్సన్‌కు ఆర్థిక, ప్రణాళిక, డెవలప్‌మెంట్ శాఖను అప్పగించారు. మహ్మద్ ఫర్వాస్‌కు కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖను ఇచ్చారు. పేదరిక నిర్మూలన శాఖను సీఎం విజయ్ తన వద్దే ఉంచుకున్నారు. తన వద్ద ఉన్న మహిళా సంక్షేమ శాఖను జగదీశ్వరికి కేటాయించారు. గతంలో ఆర్థిక శాఖను నిర్వహించిన సెంగోట్టయ్యన్‌కు ఇప్పుడు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖను అప్పగించారు. మరోవైపు, టీవీకే క్యాబినెట్‌లో చేరనున్నట్లు ఐయూఎంఎల్ ప్రకటించింది. తమ పార్టీ ఎమ్మెల్యే షాజహాన్‌ను మంత్రివర్గంలో చేర్చుకోవాలని సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించింది.

## 60 రోజుల్లో ఉద్యోగం తెచ్చుకోండి..




మెటా, అమెజాన్ సహా అనేక టెక్ కంపెనీలు లేఆఫ్స్ ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. అమెరికాలోని కంపెనీల్లోనూ ఉద్యోగుల్ని తొలగిస్తున్నారు. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో భారతీయులు కూడా ఉన్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఇప్పుడు వారి సమస్య ఉద్యోగమే కాదు.. అమెరికా ఆవాసం కూడా. ఎందుకంటే ఉద్యోగాలు కోల్పోయిన వారు దేశంలో చట్టబద్ధంగా ఉండేందుకు ఉన్న హక్కును కోల్పోతారు. ఉద్యోగం లేకుంటే హెచ్1బీ వీసా రద్దవుతుంది. ఇదే జరిగితే వేలాది మంది భారతీయుల డాలర్ డ్రీమ్స్ చెదిరిపోతాయి. అమెరికాలో ఎదగాలని ఆశలు పెట్టుకున్న ఎంతోమంది భారతీయులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు. ఇటీవల అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి అనేక సంస్థలు వరుసగా ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. ఇలా జాబ్ కోల్పోయిన వారి హెచ్1బీ వీసా స్టేటస్ రద్దవుతుంది. అయితే, వీరికి అక్కడి నిబంధనల ప్రకారం.. హెచ్1బీ వీసా హక్కు తిరిగి పొందాలంటే ఉద్యోగం కోల్పోయిన వారు 60 రోజుల్లోగా తిరిగి ఉద్యోగం పొందాలి. ఇది గ్రేస్ పీరియడ్. ఈ కాలంలోపు ఉద్యోగం పొంది స్పాన్సర్‌షిప్ పొందితేనే అమెరికాలో ఉండటానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ 60 రోజుల్లో ఉద్యోగం పొందకపోతే అలాంటివారిని గుర్తించి, బలవంతంగానైనా అమెరికా నుంచి పంపించి వేస్తారు. ప్రస్తుతం లేఆఫ్స్ వల్ల భారతీయులు లక్షలాదిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది ఏళ్ళుగా అక్కడ పని చేస్తున్నారు. కొందరు ఇంటి కోసం లోన్లు తీసుకున్నారు. పిల్లల్ని అక్కడే చదివిస్తున్నారు. పర్మినెంట్ నివాసం కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో అక్కడ ఉద్యోగాలు కోల్పోతుండటం తీవ్రంగా కలవరపెడుతోంది. అయితే, ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారు మరికొంతకాలం అమెరికాలో ఉండి ఉద్యోగం వెతుక్కునేందుకు వీలుగా ప్రస్తుతం తాత్కాలికంగా బీ--2 విజిటర్ వీసాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ఈ వీసాల కోసం దరఖాస్తులు భారీగా పెరిగిపోయాయి. ఈ వీసాలు పొందితే అమెరికాలో మరో ఆరు నెలలపాటు ఉండే అవకాశం దొరుకుతుంది. కానీ, దీనివల్ల కూడా అక్కడ అనేక న్యాయపరమైన చిక్కులు ఏర్పడే అవకాశాలున్నాయి. ఈ వీసాలు పొందడం కూడా కష్టంగా మారుతోంది. ఇందుకోసం అనేక డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. అమెరికాలోని కంపెనీల్లో ఈ ఏడాదిలోనే 1,10,000 మంది ఉద్యోగాలు కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయి.

## ఇరాన్‌పై దాడి చేయాలా.. శాంతి చర్చలా..?



ఇరాన్‌పై దాడి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మధ్య విబేధాలు వచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా ఇద్దరిమధ్యా జరిగిన ఫోన్ సంభాషణలో పరస్పరం విబేధించుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది. శాంతి చర్చలు ఎటూ తేలడం లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ దాడి చేసే అంశాన్ని అమెరికా పరిశీలిస్తోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఇరాన్‌పై రాబోయే రోజుల్లో ఎలా వ్యవహరించాలి అనే అంశంపై ట్రంప్, నెతన్యాహు చర్చించారు. వారు ఇద్దరూ దాదాపు గంటసేపు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. అయితే, ఇరాన్‌తో వ్యవహరించాల్సిన అంశంలో ఇద్దరూ పరస్పర అభిప్రాయాల్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై త్వరగా యుద్ధాన్ని ప్రారంభించాలని నెతన్యాహు డిమాండ్ చేశారు. కానీ, కొంతకాలం వేచి చూద్దామని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు సాగుతున్నందున కొంతకాలంపాటు దౌత్యపరమైన చర్చలకు అవకాశం ఇద్దామని ట్రంప్ అన్నారు. ఈ నిర్ణయాన్ని నెతన్యాహు వ్యతిరేకించారు. ఇరాన్‌పై సైనిక ఒత్తిడి తేవాలని నెతన్యాహు కోరారు. ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసి, ఆ దేశ సైన్యాన్ని ఇంకా బలహీన పర్చాలని, ఇరాన్‌లోని కీలక నిర్మాణాలపై దాడులు చేసి ధ్వంసం చేయాలని ట్రంప్‌నకు నెతన్యాము సూచించారు. దీనివల్ల ఇరాన్‌ను ఇంకా ఒత్తిడిలోకి నెట్టవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ, ఈ ప్రతిపాదనను ట్రంప్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చర్చలు కీలక దశకు చేరుకున్నాయని, ఇలాంటి దశలో దాడులు చేయలేమని, త్వరలోనే చర్చల ద్వారా ఒక పరిష్కారం లభిస్తుందని ట్రంప్ భావిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా సిద్ధంగానే ఉందన్నారు. కానీ, చర్చలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ట్రంప్ నెతన్యాహుతో చెప్పారు. ప్రస్తుతం ఖతార్, పాకిస్తాన్‌లు ఇరాన్‌తో మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రతిపాదనలకు ఇరాన్ త్వరలోనే అంగీకరిస్తుందని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. అయితే, ట్రంప్ నిర్ణయంపై నెతన్యాహు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నెతన్యాహు అమెరికాలో పర్యటించబోతున్నట్లు తెలుస్తోంది.

## ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం



**బెంగళూరు:** ఎయిరిండియా విమానానికి ప్రమాదం తప్పింది. ల్యాండింగ్ సమయంలో రన్‌వేను విమాన చివరి భాగం(తోక) తగలడంతో ఒక్కసారిగా కలవరం మొదలంది. ఢిల్లీ నుంచి నుంచి బెంగళూరుకు వచ్చిన ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అవుతుండగా ఇది చోటు చేసుకుంది. ఆ సమయంలో విమానంలో 181 ప్రయాణికులు ఉన్నారు. ఎయిర్ ఇండియా విమానం ూ×2651లో ఇది చోటు చేసుకుంది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విమానం ల్యాండింగ్ తర్వాత క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాండింగ్ కోసం సమీపిస్తున్నప్పుడు విమానం తీవ్రమైన కుదుపులకు గురైంది. ఈ అస్థిరమైన ల్యాండింగ్ ప్రయత్నం తరువాత పైలట్ గో-అరౌండ్ (ల్యాండింగ్ ప్రయత్నాన్ని రద్దు చేసి మళ్లీ గాల్లోకి ఎగిరి, మరోసారి ల్యాండింగ్ ప్రయత్నం చేయడం) చేయాలని నిర్ణయించుకున్నారు. ఇది చేస్తున్నప్పుడు విమాన చివరి భాగం నేలను తాకింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, ప్రయాణీకులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని ఎయిర్ ఇండియా ప్రతినిధి పీటీఐకి తెలిపారు.

# ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్

-మొదటిపేజీ తరువాయి

మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం. అమరావతి అయితే జీరో నుంచి మొదలుపెట్టాలి. చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు కూడా మావిగన్‌కు మద్దతు పలికారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారు. రూ.1200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానం టున్నారు. కొత్తగా నిర్మిస్తున్న 5 బిల్డింగ్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు. ఈ ఐదు బిల్డింగులకు అయ్యే మొత్తం ఖర్చు రూ. 10,665 కోట్లు.. అంటే ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427?. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్ ఇంకా అదనపు ఖర్చులన్నమాట.. అంటే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందన్న మాట. మళ్లీ ఇవే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచారు.. కానీ, పాత వాళ్లకే ఇచ్చారు. ఫైవ్‌స్టార్ హోటల్స్‌కు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే!. తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం కట్టారు. మన సెక్రటేరియట్‌కు మాత్రం ఇంత ఖర్చా? ఎందుకు?. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారు. ఇదంతా విచ్చలవిడిగా చేస్తున్న దోపిడీనే' అని తెలిపారు. ప్రజల బాగోగులను చంద్రబాబు గాలికి వదిలేశారు. రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌గా మార్చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులతో అణగదొక్కుతున్నారు. రెండేళ్లలో ఏం మంచి చేశారో చంద్రబాబు చెప్పాలి. ఏపీలో ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్?. ఎవరివి హత్యా రాజకీయాలని చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. శవ రాజకీయాలు.. హత్యా రాజకీయాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజారెడ్డిని చంపింది టీడీపీ వాళ్లు కాదా?. వైఎస్సార్ విషయంలో ఏం జరిగిందో అసెంబ్లీలో క్లిప్పింగ్‌లు చూడాలని వైఎస్ జగన్ తెలిపారు. ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్?. ఎవరివి హత్యా రాజకీయాలు.. చంద్రబాబు సమాధానం చెప్పాలి. మా కుటుంబంలో ముగ్గురు బలైపోయారు. హత్యా రాజకీయాలకు మేము బాధితులం. మా తాత, తండ్రి, బాబాయి ముగ్గురు చనిపోయారు. మాపైనే తప్పుడు రాజకీయాలు చేయిస్తున్నారు. మా తాతగారు రాజారెడ్డిని చంపింది టీడీపీ వాళ్లు కాదా? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రాజారెడ్డి హత్య జరిగింది. 1999 అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు రాజారెడ్డిగారిని చంపేశారు. వైఎస్సార్‌ను కేవలం పులివెందులకు కట్టడి చేసి, రాజకీయంగా లబ్ధి పొందాలన్నది ఇందులో ఉన్న రాజకీయ కోణం. రాజారెడ్డి కేసులో దోషులను హైదరాబాద్ తెలుగుదేశం పార్టీ సెంట్రల్ ఆఫీసు, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పెట్టి, అధికార దుర్వినియోగం చేసి, వారిని రక్షించింది ఎవరు? మరి ఎవరిది క్రిమినల్ బ్రెయిన్?. ఈ కేసులో నిందితులను జైలుకెళ్లకుండా కాపాడారు. ఎవరిది గొడ్డలి పారీ.. చంద్రబాబు చెప్పాలి. మా నాన్న విషయంలోనూ అదే జరిగింది. అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తానని చంద్రబాబు అన్నారు. అవసరమైతే అసెంబ్లీలో క్లిప్పింగ్‌లు చూడాలి. తర్వాత నాలుగు రోజులకే వైఎస్సార్ ప్రమాదంలో చనిపోయారు. మేం బాధితులం. కాని, తిరిగి మాపైనే వీళ్లు తప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. మా చిన్నాయన వివేకానందరెడ్డి ఇదే చంద్రబాబుగారి ప్రభుత్వంలో హత్యకు గురైన మాట వాస్తవమైతే, పైగా తానే హత్య చేశానంటూ సాక్షాత్తూ టీవీ లైవ్ షోల్లో చెలరేగిపోయి మాట్లాడిన దస్తగిరి అనే వ్యక్తి ఇవాళ స్వేచ్ఛగా పోలీసుల వత్తాసుతో దర్జాగా కార్లలో తిరుగుతున్నాడు. పైగా చంద్రబాబుకు లాయర్ లూథ్రానే, దస్తగిరికీ లాయర్ లూథ్రానే. మరి ఎవరిది క్రిమినల్ బ్రెయిన్?. రాజకీయ లబ్ధికోసం ప్రలోభాలతో హంతకులను రక్షించడం, నిర్దోషులను హింసించడం. వివేకానందరెడ్డి కేసులో జరుగుతున్నది ఇదే. చంద్రబాబు బావమరిది, వియ్యంకుడు, బాలకృష్ణ గన్ పట్టుకుని టపాటపామని ఇద్దరిని కాల్చిపడేయలేదా? మరి ఎవరిది గన్ కల్చర్?. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే ఆ ఇంట్లో వాచ్‌మెన్‌ను బండరాయితో మోది చంపేశారు?. పాపం ఎన్టీఆర్ కొడుకు హరికృష్ణగారు యాక్సిడెంట్‌లో చనిపోతే, పరామర్శ కోసం అని పోయి, కేటీఆర్‌తో పొత్తులపై చంద్రబాబు మాట్లాడాడు. మరి ఎవరివి శవ రాజకీయాలు?. వంగవీటి మోహనరంగాగారు ఒక టైగర్. ఆయన ఎలా చనిపోయారు?. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని విజయవాడలో నిరాహారదీక్ష చేస్తుంటే, అర్థరాత్రి నరికి చంపేశారు. ఈ ఘటనలో వేళ్లన్నీ చంద్రబాబు వైపే చూపిస్తాయి. జగన్ మంచివాడు కాబట్టే, మా తాతను చంపిన వాళ్లు కూడా ప్రశాంతంగా ఉన్నారు. జగన్ చెడ్డోడు అయితే వాళ్లు ప్రశాంతంగా ఉండేవాళ్లా? జగన్ నైజం ఎలాంటిది? మనస్తత్వం ఎలాంటిది చెప్పడానికి ఇది నిదృనం. ప్రజలకు మంచి చేసి పేరు తెచ్చుకోవాలని మా నాన్న నేర్పించాడు. సోషల్ మీడియా పోస్టులపై తన కార్యకర్తలతో తప్పుడు కేసులు పెట్టించి, నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను అడ్డుపెట్టుకుని, ట్విట్టర్, యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్‌స్టా లాంటి హెడ్ క్వార్టర్స్‌కు నేరుగా ఈ పోలీసులే ఆ పోస్టులను డిలీట్ చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. పోలీసులను వాడుకుని అకౌంట్లను బ్లాక్ చేయిస్తున్నారు. పోలీసులు తమ ప్రాథమిక విధులను వదిలేశారు. రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా కాలేజీల్లో గంజాయి అమ్మిస్తున్నారు. ఎక్కడ చూసినా డ్రగ్సే ఉంటున్నాయని జగన్ ధ్వజమెత్తారు.

# పట్టణ ప్రాంతాల్లో రింగ్‌రోడ్లు, బైపాస్‌లు

-మొదటిపేజీ తరువాయి

మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు. సాధారణ మున్సిపల్ పనులకు మించి ఆధునిక పట్టణాభివృద్ధిపై ఫోకస్ చేశామన్నారు. తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మురుగు నీటి శుద్ధిపై ప్రభుత్వం ప్రధాన దృష్టి సారించిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా విశాఖ, మంగళగిరి--తాడేపల్లిలో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు.



పట్టణాల్లో కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ముందుగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని మంత్రి తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ అవకాశాన్ని రాష్ట్రం పూర్తిస్థాయిలో వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యుత్తమ పట్టణ మౌలిక వసతుల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికి మోడల్‌గా నిలుస్తుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలో పలు నగరాలు, పట్టణాలకు రింగ్ రోడ్లు, సెమీ రింగ్ రోడ్లు, బైపాస్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పట్టణాల్లోని రహదారులు వాహన రద్దీతో ఇరుగ్గా మారుతున్నందున ఆ ట్రాఫిక్‌ను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అర్బన్ డీ-కంజెషన్ పాలసీని సద్వినియోగం చేసుకోవాలని యోచిస్తోంది. ఇప్పటికే శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి తొలి సెమీ రింగ్ రోడ్‌ను సాధించింది.

కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి లేపాక్షి మీదుగా హిందూపురం పెద్దచెరువుకు ఆవలి వైపు మడకశిర, సిర వరకు జాతీయ రహదారి (544ఇ)ని 10 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. దీనివల్ల హిందూపురానికి ఒకవైపు బైపాస్ ఉన్నట్లే! అయితే, పట్టణ శివారులో కర్ణాటక సరిహద్దులో పారిశ్రామిక ప్రాంతం ఉంది. అటునుంచి వచ్చే వాహనాలన్నీ హిందూపురం పట్టణం లోపలి నుంచి ప్రయాణిస్తున్నాయి.

ఇప్పుడు అర్బన్ డీ-కంజెషన్ పాలసీలో భాగంగా ఎన్‌హెచ్-544ఇలో లేపాక్షి వద్ద నుంచి హిందూపురం పారిశ్రామికవాడ మీదుగా, పట్టణానికి రెండో వైపు నుంచి రోడ్ నిర్మించి పరిగి సమీపంలో హైవేకి కలుపుతారు. అంటే, దాదాపు 20 కి.మీ. మేర సెమీ రింగ్ రోడ్ నిర్మించనున్నారు. ఇప్పటికే హైవేని, ఈ సెమీ రింగ్ రోడ్‌ను కలిపితే హిందూపురం చుట్టూరా రింగ్ రోడ్ వచ్చినట్లు అవుతుంది.

**ఇదీ కేంద్రం విధానం**

అర్బన్ డీ-కంజెషన్ విధానంలో భాగంగా పట్టణాల చుట్టూ రింగ్, సెమీ రింగ్, బైపాస్ రోడ్లు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇస్తూ, రాష్ట్ర ప్రభుత్వాన్నీ భాగస్వామిని చేస్తోంది. రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వ్యయాన్ని పూర్తిగా లేదా సగమైనా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలి. నిర్మాణ వ్యయంలో కొంత మొత్తాన్ని రాష్ట్రం వెచ్చించాలి. లేదంటే మెటీరియల్స్‌కు సీనరేజ్ ఫీజులు, వివిధ పన్నులు, రాష్ట్ర జీఎస్టీ నుంచి మినహాయింపునివ్వాలి. ఈ రోడ్లకు ఆనుకొని పట్టణ ప్రాంతం అభివృద్ధి చెందితే, దానిద్వారా వచ్చే రాబడిలో కొంత కేంద్రానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనల్లో వేటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిస్తే ఆయా రోడ్ల నిర్మాణానికి మోర్త్ ముందుకొస్తుంది.

# మూడు వస్తే.. మూడేది ఎవరికి

**విజయవాడ :** రాజకీయాల్లో అవకాశాలు రావు, తీసుకోవాలి. ప్రజలు ఎపుడూ తెలివైన వాళ్ళు. వారికి తామే ఆల్టర్నేషన్ అని ఎవరైనా అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు, ప్రజలు తమదైన చైతన్యంతో తమకు కావాల్సిన ఆల్టర్నేషన్ ని తెచ్చుకుంటారు. గద్దె మీద కూర్చోబెడతారు. దానికి తాజా ఉదాహరణ తమిళనాడు. అక్కడ డీఎంకే ఓడితే అన్నా డీఎంకేనే దిక్కు అనుకున్నారు ఆ పార్టీ నేతలు. కానీ ఫలితాలు వచ్చిన తరువాత సీన్ అర్థం అయింది మూడవ ప్లేస్ లోకి పడిపోయింది. అంటే జనాల ఆలోచనలు ఎంత వేగంగా మారుతాయన్నది అర్థం చేసుకోవాలిన అవసరం ఉంది. ఇదే కాదు దేశాన్ని మూడు నాలుగు దశాబ్దాలకు పైగా ఏకచత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ పార్టీ కూడా చివరికి విపక్షంలోకి రావాల్సి వచ్చింది. ఏపీ లో చూస్తే ప్రస్తుతానికి రాజకీయ వాతావరణం కూటమికి వైసీపీయే ప్రత్యర్థిగా ఉంది. అదే వైసీపీలో ధీమాను కూడా పెంచుతోంది. కూటమి తప్పులు చేస్తే అధికారం తమకే దక్కుతుందని మెచ్చి వరమాలను తమ మెడలో వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. యాంటీ ఇంకెంబెన్సీ మీదనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మేమే అని చెబుతున్నారు. మరో విషయం ఏమిటి అంటే ఒక పార్టీకి ఒకేసారి అధికారం ఇవ్వడం ఏపీ ప్రజలు చేస్తారు కాబట్టి ఆ ట్రాక్ రికార్డు చూసినా తమకే చాన్స్ అని కూడా వారు విశ్వాసంగా ఉన్నారు.అయితే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉంది. రాజకీయంగా చూస్తే అది చాలా ఎక్కువ సమయమే. ఎందుకంటే క్షణాలలో అంతా మారే సీన్ పొలిటికల్ గా ఉంటుంది. అలా చూసినపుడు ఈ మూడేళ్ళలో కొత్త పార్టీ వచ్చినా లేక థర్డ్ ఫోర్స్ ఏదైనా ఎమర్జ్ అయినా ఎవరికి ఎక్కువ నష్టం అన్న చర్చ వస్తోంది. సాధారణంగా మూడవ పార్టీ వస్తే కనుక అది ఖాయంగా ప్రతిపక్ష పార్టీకే చేటు చేస్తుంది. దానికి మళ్ళీ అన్నా డీఎంకేని ఉదహరించాల్సి ఉంటుంది. అందువల్ల ఏపీలో కూడా వైసీపీకే దెబ్బ పడుతుందని అనే వారూ ఉన్నారు. ఏపీలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం పాలనలో అసంతృప్తి ఉంది. అయితే అది ఏ మేరకు అన్నది తెలియడం లేదు కానీ అధికారంలో ఉన్న పార్టీకి సహజం. కానీ ఆ అసంతృప్తి వైసీపీ వైపు మళ్ళడం లేదు. అంటే వైసీపీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓట్లు అలా నికార్సుగా నిలిచి ఉన్నాయో లేవో తెలియడం లేదు కానీ



కొత్త ఓట్లు అయితే జత చేరడం లేదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. మరో వైపు చూస్తే ఏపీలో వైసీపీని వీడిన వారు ఉన్నారు, కూటమిలో చోటు లేని వారు ఉన్నారు. ఇంకా అన్ని పార్టీల తీరు చూసి కొత్తదనం కోసం ఆలోచిస్తున్న వారు ఉన్నారు. వీరందరి కోసం ఏదైనా పార్టీ వచ్చినా లేక ఫోర్స్ గా అందరూ కలిసి ప్రయత్నం చేసినా అపుడు ఏమిటి జరుగుతుంది అన్నది ఒక కీలకమైన చర్చ. అలాంటి సందర్భాలలో కచ్చితంగా వైసీపీకి ఇబ్బంది అవుతుందని అంటున్నారు. వైసీపీ అయితే రెండేళ్ళ కాలంలో జనంలోకి పెద్దగా వచ్చింది లేదు. ఇక అసెంబ్లీ ముఖం ఎమ్మెల్యేలు చూసింది అంతకంటే లేదు. అధినేత జగన్ కూడా జనంలోకి వచ్చే ప్రయత్నం చేయడం లేదు. దాంతో తమ గొంతుకని విపక్షం వినిపించలేకపోతోంది అన్న భావన అయితే మెల్లగా జనంలోకి వెళ్తోంది. సరిగ్గా ఈ సమయంలో సర్దుకుని వైసీపీ దూకుడుగా ముందుకు సాగకపోతే మాత్రం మూడవ పార్టీ అయినా లేదా శక్తి అయినా వస్తే మాత్రం ఆ పార్టీ విజయావకాశాలనే దెబ్బ తీస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి. చూడాలి మరి ఏపీ రాజకీయాల్లో ఏ మార్పులు వస్తాయో.

## కార్యకర్తే అధినేత

-మొదటిపేజీ తరువాయి

నిలిచేలా టీడీపీ చేపట్టిన విప్లవాత్మక పథకాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు. ప్రభుత్వ పథకాల రూపకల్పనలో మహిళల భాగస్వామ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజలందరికీ అర్థమయ్యేలా చాటిచెప్పాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత" అనే బలమైన సందేశం ఈ మహానాడు వేదికగా ప్రతి ఒక్కరికీ చేరాలని దిశానిర్దేశం చేశారు. డిజిటల్, భౌతిక రూపాల కలయికతో హైబ్రిడ్ విధానంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రోజువారీ సమయపాలనకు పెద్దపీట వేస్తూ, రెండు రోజుల పాటు ఉదయం 9 గంటలకే మహానాడు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. క్షేత్రస్థాయి శ్రేణులను ఉత్తేజితం చేస్తూ ప్రతి ఒక్కరినీ ఈ వేడుకలో భాగస్వాములను చేయాలని అధినేత ఆదేశించారు. మహానాడు నిర్వహణను కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్రామాల్లోని క్లస్టర్ స్థాయిలోనే నిర్వహించాలని పొలిట్ బ్యూరో ఖరారు చేసింది. అన్ని క్లస్టర్లలో తెలుగువారి ఆరాధ్యదైవం, నందమూరి తారకరామారావు విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మహానాడుకు రెండు రోజుల ముందు నుంచే పండుగ వాతావరణం ప్రతిబింబించేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కార్యకర్త, అభిమాని ఇంటిపై టీడీపీ జెండాను రెపరెపలాడించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం**

పార్టీ భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించేలా పొలిట్ బ్యూరో సమావేశంలో మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. వీటితో పాటు మహానాడులో చర్చకు రానున్న వివిధ అంశాలపై చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ప్రసంగించే ప్రతి వక్తా తమకు కేటాయించిన అంశంపై పూర్తి నిష్ణాతుడై ఉండాలని, ఎలాంటి సాగతీత లేకుండా, సమయపాలన పాటిస్తూ విషయాన్ని సూటిగా, స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ మహానాడులో విభిన్న ప్రాంతాల సమస్యలు, రాజకీయ ముఖచిత్రంపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 10, తెలంగాణకు సంబంధించి 4, అండమాన్‌కు చెందిన 1 అంశంతో పాటు ఉమ్మడి అంశాలపై మరో 4 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారు. వీటికి తోడు రెండు రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిస్థితులు, సవాళ్లపై ప్రత్యేక రాజకీయ తీర్మానం రూపంలో చర్చ జరగనుశీది. పార్టీ ఆవిర్భావం నుంచి జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలు తెలుగుదేశానికి కొండంత అండగా నిలిచారని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. బీసీల సర్వతోముఖాభివృద్ధికి, ఆర్థిక ఎదుగుదలకు పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందనే బలమైన సందేశాన్ని ఈ మహానాడు ద్వారా క్యాడర్‌లోకి పంపనున్నారు. పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును ఎక్కడా చేజారిపోకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకొస్తున్న భారీ పెట్టుబడులు, సాధిస్తున్న ప్రగతిని మహానాడు వేదికగా ప్రజల ముందుకు తీసుకురానున్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ 'గొడ్డలి పార్టీ' సాగిస్తున్న కుట్రలను, విధ్వంసకర రాజకీయాలను ఈ వేదికగా ఎండగట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. "నా దేశం-నా బాధ్యత" నినాదంతో చేపట్టాల్సిన పొదుపు చర్యలపై కూడా ఈ మహానాడులో ప్రత్యేకంగా చర్చించనున్నారు.

## 123 పట్టణాల్లో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

**-- ఈ నెల 23 నుంచి జూన్ 20వ తేదీ వరకు అమలు**




**అమరావతి :** ఏపీ ప్రభుత్వం "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో విస్తృత స్థాయి పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమం ఈ నెల 23 నుంచి జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో అమలు చేయబడుతుంది. స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యాన్ని పట్టణాల్లో కనిపించే పరిశుభ్రతగా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా మార్చడం, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. నాలుగు వారాలుగా రూపొందించిన ఈ కార్యక్రమంలో ప్రతి వారం ప్రత్యేక లక్ష్యాలతో అమలు చేపడతారు. మొదటి వారంలో రోడ్లు, ప్రజా ప్రదేశాల్లో కనిపించే చెత్త కుప్పలను తొలగించడం, స్పష్టమైన పరిశుభ్రతను మెరుగుపరచడం పై దష్టి ఉంటుంది. రెండవ వారంలో వర్షపు నీటి కాలువలు, నాళాలు మరియు వెనుక వీధులను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి వర్షాకాలానికి ముందస్తు సిద్ధతను మెరుగుపరుస్తారు. మూడవ వారంలో గహాలు, వాణిజ్య ప్రాంతాల్లో వ్యర్థాల వర్గీకరణను అమలు చేసి, పెద్ద స్థాయి వ్యర్థ ఉత్పత్తిదారులపై నియంత్రణను కట్టుదిట్టం చేస్తారు. నాలుగవ వారంలో పబ్లిక్ టాయిలెట్లు శుభ్రపరచడం, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను పూర్తిగా తొలగించడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తారు. పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు అమలు బాధ్యతలను చేపడతారు. రోజువారీ పర్యవేక్షణ, కేంద్రికత డేటా సిస్టమ్ ద్వారా నివేదికలు, జియోట్యాగ్డ్ ఫోటోలు ద్వారా పురోగతిని అంచనా వేస్తారు. ఈ సందర్భంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -- అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం సాధారణ శుభ్రత చర్యలకంటే మించి మిషన్ మోడ్‌లో అమలు చేయబడుతుందని చెప్పారు. ప్రజల ప్రవర్తనలో స్థిరమైన మార్పు తీసుకురావడం, పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. పరిపాలనా నాయకత్వం, సాంకేతిక పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యం కలిసివస్తేనే దీని విజయాన్ని సాధించగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడింది. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొనేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం రాష్ట్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణలో ఉండి, పనితీరు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకుంటారు. జూన్ 20న ఈ కార్యక్రమం ముగియనుండగా, రాష్ట్ర స్థాయి పనితీరు నివేదికను చీఫ్ సెక్రటరీకి సమర్పిస్తారు. ఉత్తమ ప్రదర్శన చేసిన జిల్లాలు, పట్టణాలకు గుర్తింపు ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ పరిశుభ్రతలో దీర్ఘకాలిక మార్పులు తీసుకురావడమే కాకుండా ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వెల్లడించారు.

## వేడెక్కిన ధర్మవరం రాజకీయాలు

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ లక్ష్యంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రభుత్వ విమర్శకులను, ప్రశ్నించే వారిని అణచివేస్తున్నారంటూ మంత్రి సత్యకుమార్‌పై సొంత పార్టీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. "సత్యకుమార్.. నీకు దమ్ముంటే నీ పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లోకి రా" అంటూ ధర్మవరం స్థానిక నాయకులు సవాల్ విసరడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ తాజా రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఒక దాడి ఘటన. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన హైకోర్టు న్యాయవాది కె. అంజన్ రెడ్డిపై మంత్రి వ్యక్తిగత సహాయకుడుహరీష్, అనుచరులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అంజన్ రెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రశ్నించే వారిపై ఇలా దౌర్జన్యాలు చేయడం దుర్మార్గమని స్థానిక నేతలు మండిపడుతున్నారు.

# స్టాపులేని జల్లిపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఇబ్బంది పడుతున్న సిబ్బంది





**మే 21 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** కూడేరు మండలం జల్లిపల్లి లో ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ లో సిబ్బంది తక్కువ ఉండడం వల్ల దాదాపుగా మరుట్ల గ్రామపంచాయతీ మరియు ఉదిరిపికొండ, శివరాం పేట, కొర్రకోడు, హంసపల్లి, జల్లిపల్లి కొర్రకోడు డ్యామ్ రైతులు రెన్యువల్ కోశం వస్తుంటే బ్యాంక్ లో సిబ్బంది లేక చాలా ఇబ్బంది పడుతున్నారు అని స్థానిక రైతులు వాపో తున్నారు కావున వెంటనే ర్ ఎశీ గారు తగు స్పందించి సిబ్బంది ని జల్లిపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ కు పంపే విధంగా చూడాలని స్థానిక రైతులు వాపోతున్నారు.

# ఎటపాక మండల సమస్యలపై ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు వినతి

## నెల్లిపాక ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి వినతిపత్రం

## ఎమ్మెల్సీ హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ మండల అధ్యక్షులు నలజాల శ్యామ్ ప్రసాద్





**ఎటపాక, మే 21 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండల పరిధిలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఎటపాక మండల అధ్యక్షులు నలజాల శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గురువారం ఎమ్మెల్సీ సోము వీర్రాజును రాజమహేంద్రవరంలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు కీలక సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతి పత్రాలు అందజేశారు. మండల అధ్యక్షులు నలజాల శ్యాంప్రసాద్ ప్రత్యేక చొరవతో, నెల్లిపాక గ్రామంలో ఇంతవరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోని హరిజన, గిరిజన వీధుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మించాలని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గ్రామీణ నీటి సరఫరా అధికారుల ద్వారా రూపొందించిన అంచనా వ్యయం నివేదికను వారికి అందజేశారు.బీజేపీ నాయకుల వినతిపై ఎమ్మెల్సీ సోము వీర్రాజు తక్షణమే స్పందించారు. సంబంధిత జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి, నెల్లిపాక గ్రామంలోని హరిజన, గిరిజన వీధుల్లో అత్యవసరంగా సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మించాలని ఆదేశించారు. ఈ పనుల నిమిత్తం అవసరమైతే ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో జరిగే ఇలాంటి ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు."సమాజంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని, సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరడమే బీజేపీ పార్టీ ముఖ్య ఉద్దేశ్యం" అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఈ సందర్భంగా ఘంటాపథంగా స్పష్టం చేశారు.ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి రవికుమార్ (గాంధీ), ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షురాలు గంధం జయమ్మ, పార్టీ నాయకులు మాగంటి సాయి, చిచ్చడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. తమ వినతిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు మండల బీజేపీ నాయకులు

# రాజకీయ విశ్లేషణ పేరుతో వాస్తవాలు వక్రీకరించడం తగదు

### జనసేన నాయకురాలు రియా

**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్. కొట్టి రామం. మే. 21.** రాజకీయ విశ్లేషణ పేరుతో వాస్తవాలు వక్రీకరించడం తగదని ఊహాగానాలను నిజం అనిపించేలా చెప్పడం ప్రొఫెసర్ నాగేశ్వర్ కు తగదని మేధావి అనే పదానికి విలువ ఉంచుకోవాలని పాలకొల్లు నియోజకవర్గం జనసేన నాయకురాలు రియా గురువారం ఒక ప్రకటనలో అన్నారు. జగన్ రెడ్డి గురించి ఎవరిని అరెస్ట్ చేయాలి, ఎవరిని కాపాడాలి అనే ఆలోచనల్లో జనసేన లేదని ప్రజా సమస్యలపై పోరాడటం, వ్యవస్థను ప్రశ్నించడం, యువతకు భరోసా ఇవ్వడం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముందుకు వెళు తున్నారని రియా అన్నారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా... అధికారానికి తలవంచకుండా, "నా పోరాటం నేనే చేస్తా" అని నిలబడ్డ నాయకుడు పవన్ కళ్యాణ్ కాగా అలాంటి నాయకుడిని వదిలేసి, ఈరోజు రాజకీయంగా బలహీన స్థితిలో ఉన్న వ్యక్తి కోసం ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ జరుగుతుందని చెప్పడం పూర్తిగా అసంబద్ధం అని రియా పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితిలో, కోర్టు అనుమతులతో తిరిగే నాయకుడి కోసం కేంద్ర హోం మంత్రివరకు వెళ్లి మాట్లాడాల్సిన అవసరం జనసేనకు లేదని జనసేన నడిచేది వ్యక్తుల చుట్టూ కాదని ప్రజల చుట్టూ అని రియా అన్నారు. అవాస్తవాలతో ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రజలను తప్పుదారి పట్టించడం సరి కాదన్నారు. నాగేశ్వర్ వద్ద నిజ మైన ఆధారాలు ఉంటే బయట పెట్టాలన్నారు. అలా కాకుండా సమాచారం ఉంది, లోపలి వార్త అంటూ రాజకీయ కథలు చెప్పడం మానేయలన్నారు. ప్రజలు అమాయకులు కాదని ఇప్పుడు విశ్లేషణకూ, ప్రచారానికీ మధ్య తేడా గుర్తించే స్థాయికి వచ్చారని రియా తెలిపారు. మేధావితనం అంటే నిజం చెప్పడమని ఒక వర్గం కోరుకున్న



కథనాన్ని వినిపించడం కాదని రియా విమర్శించారు.

# విద్యుత్ శాఖఅధికారులతో సమీక్ష సమావేశం.ఎంజీ ఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.** పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో ఐదు మండలాల విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఎంజీఆర్ గారు సమీక్షా సమావేశం వేసవిలో ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి ఎమ్మెల్యే వేసవి కాలంలో కరెంట్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో ఐదు మండలాలకు చెందిన విద్యుత్ శాఖ జె.ఈలు, ఏ.ఈలు మరియు ఇతర అధికారులతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, లో వోల్టేజ్ సమస్యలు ఉన్న చోట వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని,ఎక్కడైనా కరెంట్ కోతలు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేసి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఎంజీఆర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐదు మండలాల విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల కై ప్రజా దర్బార్.

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. పాతపట్నం** నియోజకవర్గ కేంద్ర కార్యాల యంలో" ప్రజాదర్బార్" నిర్వహించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజల సమస్యల పరిష్కారం కోసమే "ప్రజా దర్బార్"... ఎమ్మెల్యే ఎంజీఆర్ వీలున్నంత వేగంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో "ప్రజాదర్బార్" నిర్వహించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ శ్రీ మామిడి గోవిందరావు ,ఈ దర్బార్ కు సంబందించి 26 వినతులు రెవెన్యూ,సీఎంఆర్ఎఫ్,పెన్షన్,త్రాగునీరు,రహదారులు తదితర సమస్యలపై ప్రజలు నుంచి నేరుగా వినతులు స్వీకరించి తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఇక మీదట తరచూ "ప్రజా దర్బార్" లను నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# పోలీసులపై క్రిమినల్ దాడి

### విస్తు పోతున్న ప్రజలు




చెన్నూరు.... పోలీసులపై ఓ క్రిమినల్ దాడి చేసిన ఘటన చెన్నూరులో చోటుచేసుకుంది. వివరాలలోకెళితే ఇటీవల కడప నగరం అల్మాస్ పేట లో జరిగిన ఘర్షణలకు సంబంధించి చెన్నూరు కు చెందిన జహీరుద్దీన్ ఓ వర్గాన్ని రెచ్చగొడుతూ తొందరగా అల్మాస్ పేట కు చేరుకోవాలంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సంఘటనకు సంబంధించి చెన్నూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఈ కేసు విషయమై అధికారుల ఆదేశాల మేరకు జహీరుద్దీన్ ను స్టేషన్ కు పిలుచుకు వచ్చేందుకై ఓ పోలీసు వెళ్ళగా అతనిపై జహీరుద్దీన్ దాడి చేసినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఇతర పోలీసు సిబ్బంది వెంటనే వెళ్లి జహీరుద్దీన్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జహీరుద్దీన్ పై గతంలో కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పలు కేసులు నమోదు అయినట్లు తెలుస్తుంది. ఇటీవల చెన్నూరులో చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి కూడా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్ట్ లు పంపడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ పంపడం జరిగింది. ఇటీవల జైలు నుండి బెయిల్ పై వచ్చి తిరిగి పోలీసులపై దాడి చేయడంపై మండల ప్రజలు విస్తు పోతున్నారు. పోలీసులకే రక్షణ కరువైందన్న చర్చ మండలంలో సాగుతోంది. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై సి ఐ ఎస్.కె చాంద్ భాష నువివరణ కోరగా దాడి జరిగిన ఘటన వాస్తవమేనని కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేశారు.

# గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయి

**హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలపై ప్రిన్సిపల్ లతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి,మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల సెక్రటరీ సైదులు, ఆర్సీవో లు,ప్రిన్సిపల్ లు,ఇతర అధికారులు పాల్గోన్నారు. 100 శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించిన గురుకులాల పాఠశాలల ప్రిన్సిపల్ లను మంత్రి సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 100 శాతం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్ లకు అభినందనలు ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల పాఠశాలలు ఈసారి మరిన్ని మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలి. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇస్తుంది గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచుకున్నాం. ప్రిన్సిపల్ లకు అభినందనలు.

# వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్!..





**తహసీల్దార్ సరస్వతి!..**

**వి.ఆర్.పురం,మే21(ప్రజాజ్యోతిప్రతినిధి)** వన్ మంత్,వన్ విలేజ్,ఫోర్ విజిట్స్,కార్యక్రమంలో భాగంగా!వీరపాపినకుంట, నందు మూడవ గురువారం,తహశీల్దార్ సరస్వతి,గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ సరస్వతి మాట్లాడుతూ,ప్రభుత్వ ఆదేశాల మేరకు,వరరామచంద్రాపురం, మండలంలో మే నెల ఒకటవ గురువారం(07/05/2026) న గ్రామసభ నిర్వహించి గ్రామంలోని వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని,వివరించారు. మరల రెండవ గురువారం(14/05/2026)న సదరు దరఖాస్తులను సమస్యలను పరిష్కరించుటకు విచారించడమైనదని అన్నారు.మరల మూడవ గురువారం తేదీ.21/05/2026 న వచ్చిన దరఖాస్తులలో కొన్ని సమస్యలను పరిష్కరించడమైనది. నాలుగవ గురువారం 28/05/2026 లోపల అన్నిసమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపుతామని సూచించారు.

**పరిష్కరించిన సమస్యలు!..**

1:-ఎల్.ఆర్.డి.బి సర్టిఫికెట్లుజారీ
2:-ఎఫ్.ఎం.సి, సర్టిఫికెట్లు జారీ
3:-త్రాగు నీటి సరఫరా కొరకు విద్యుత్ మోటార్ మరమ్మత్తు చెయ్యటమైనది.
4:-త్రాగు నీటి సరఫరా కొరకు కొత్త స్కీమ్ మంజూరి
5:-విద్యుత్ స్తంభాల మంజూరి కొరకు రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు.

ఈకార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్, సి.డి.పి.ఓ, మల్లిక, ఏ.పి.ఎం,(వెలుగు) స్వామి,ఏ.ఈ,ఆర్ డబ్ల్యు.ఎస్,ఎం సాయిరాం, ఎం.ఆర్.ఐ,మడకం రామకృష్ణ,ఫారెస్ట్ డిపార్ట్మెంట్, డి.ఆర్.ఓ, ఎఫ్.బి.ఓ, విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ కె బాపు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,వివిద శాఖలప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సేవాతత్పరుడు పిన్నింటి భానోజీ నాయుడు

- పంచాయతీ అభివృద్ధే అతని ఆకాంక్ష
- గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి
- ఘనంగా మండల కేంద్రంలో పిన్నింటి జన్మదిన వేడుకలు
- ఉచిత వైద్య శిబిరం ,రక్తదాన శిబిరంతో సమాజ సేవకు మరో నిదర్శనం
- యువతలో మానవతా దృక్పథాన్ని పెంపొందించేలా ప్రత్యేక చర్యలు
- రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచిన ఆయన సేవాగుణం








**రణస్థలం ,ప్రజాజ్యోతి న్యూస్ :** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు , రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడి జన్మదిన వేడుకలను రణస్థలం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ,ప్రజాప్రతినిధులు ,గ్రామ పెద్దలు ,యువకులు పెద్ద ఎత్తున పాల్గొని భానోజీ నాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజ సేవా కార్యక్రమాలతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా , అనేక మంది ప్రజలు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని సేవలను పొందారు. వీటితోపాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి స్వయంగా ఆయన రక్తదానం చేసి యువతలో మానవతా భావాన్ని పెంపొందించారు. ఈ మేరకు పలువురు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయగా శిబిరంలో పాల్గొన్న వారికి పిన్నింటి సర్టిఫికెట్లను అందజేశారు. పిన్నింటి భానోజీ నాయుడు ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ , గ్రామాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా నిలుస్తూ ,పేదలకు ఆర్థిక సహాయం , విద్యార్థులకు ప్రోత్సాహం , అవసరమైన వారికి వైద్య సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. గ్రామా భివృద్ధి ,పారిశుద్ధ్యం , మౌలిక వసతుల అభివృద్ధి లో ఆయన చూపిన చొరవ ప్రజల మనస్సులో ఆయనను చిరస్థాయిగా నిలిపింది. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ ,వారి కష్టాల్లో భాగస్వామ్యం అవుతూ నిజమైన ప్రజా నాయకుడిగా భానోజీ నాయుడు మంచి పేరు సంపాదించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తనయుడు నడుకుదుటి తేజబాబు, కలిశెట్టి సూర్యనారాయణ , లెంక శ్యామల రావు , ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి వెంకట రమణ , సర్పంచ్ రమణయ్య , ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల గ్రామ సర్పంచులు పలువురు ,కూటమి నాయకులు , కార్యకర్తలు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కూన రవికుమార్






**- శ్రీకాకుళం జిల్లా నుండి అత్యుత్తమ క్రికెటర్లను తయారు చేయడమే నా లక్ష్యం**

**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** ఆముదాలవలస శాసనసభ్యులు , రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఉన్నటువంటి క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నందు ప్రకటించారు .అందులో భాగంగా వైస్ ప్రెసిడెంట్ గా తర్లాడ బాలమురళిని , సెక్రెటరీగా షేక్ హసన్ రాజా ను , 23 సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్నిఎన్నుకున్నారు.జిల్లా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తూ యువ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు సంఘం కట్టుబడి పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.అదే కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం నూతన కమిటీ కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ ఎన్నికల సందర్భంగా పలువురు క్రీడా ప్రముఖులు, సంఘ సభ్యులు , అభిమానులు కూన రవికుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల యువతకు అవకాశాలు అందించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర మరియు జాతీయ స్థాయికి తీర్చిదిద్దడం లక్ష్యంగా ముందుకు



సాగుతామని నూతన అధ్యక్షుడు కూన రవికుమార్ పేర్కొన్నారు.ఖ

# మిట్టపల్లె పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గొన్నా మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



**ఆళ్లగడ్డ (మిట్టపల్లె) ప్రజాజ్యోతి :మే=21** ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవం ఘనంగా జరిగింది.గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు.గ్రామానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేకు గ్రామ ప్రవేశ ద్వారం వద్ద గ్రామ పెద్దలు, భక్తులు ఘన స్వాగతం పలికారు.పూల వర్షం కురిపిస్తూ సత్కరించారు. అనంతరం ఆయన పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ దేవర మహోత్సవం ఈసారి మరింత వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా గంగుల బిజేంద్రారెడ్డి హాజరవడంతో భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ ఉత్సవాల్లో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారినిదర్శించుకున్నారు. యువకులు, మహిళలు ఉత్సవాల నిర్వహణలో చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నంద్యాల నుంచి తిరుపతి వైపు వెళ్ళు భక్తులకు శుభ వార్త.

**నంద్యాల:మే=21ప్రజాజ్యోతి**



నంద్యాల జిల్లా నుంచి తిరుపతి వైపు వెళ్ళు రైలు ప్రయాణికులకు, శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు, దక్షిణ మధ్య రైల్వే శాఖ శుభవార్త తెలిపినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. నంద్యాల మీదుగా తిరుపతికి సమ్మర్ స్పెషల్ వీక్లీ ట్రైన్ ను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు నడుపనున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. తిరుపతి నుంచి చర్లపల్లికి కడప, ఎర్రగుంట్ల, నంద్యాల, నడికుడి మీదుగా వారంతపు ఎక్స్ ప్రెస్ ట్రైన్ ను 17443 ను 28 వ తేదీ నడుపనున్నారని. తిరుగు ప్రయాణంలో 17444 నెంబరు ట్రైన్ ను చర్లపల్లి నుంచి నడికుడి, నంద్యాల మీదుగా ఎర్రగుంట్ల , కడప మీదుగా తిరుపతి కి 29 వ తేదీ రెండు ట్రిప్పులు నడుప నున్నారని, ఈ ట్రైన్ తిరుపతి లో సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభం అయ్యి నంద్యాల కు రాత్రి 9:00 గంటలకు చేరుకొని చర్లపల్లి కి మరుసటి రోజు ఉదయం 8:30 కి చేరుకుంటుంది, తిరుగు ప్రయాణం లో చర్లపల్లి లో సాయంత్రం 4:20 కి ప్రారంభించి నంద్యాలకు అర్ధరాత్రి 12:00 గంటలకు చేరుకొని మరుసటి రోజు ఉదయం 7:30 కి తిరుపతి చేరుకుంటుందని. నంద్యాల జిల్లా ప్రజలు, రైలు ప్రయాణికులు ఈ రైలును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# త్రాగునీటి చేతి పంపుల ఏర్పాటుకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి శంకుస్థాపన



**కాకినాడ జిల్లా మే 21 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండలం పరిధిలోని పేరవరం,తూర్పు లక్ష్మీపురం గ్రామాలలో మండల పరిషత్ సాధారణ నిధులతో ఏర్పాటు చేయనున్న చేతి పంపులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు,ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొని పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యలు తీరేలా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యిజనగిరి శివ ప్రసాద్,కూటమి శ్రేణులు,ఎంపీడీఓ రామరాజు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యూరియా అమ్మకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవు

**ఎమ్మిగనూరులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జాయింట్ కలెక్టర్**

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**



**ఎమ్మిగనూరు మే 21(ప్రజా జ్యోతి ):** యూరియా అమ్మకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు పట్టణంలోని గురు రాఘవేంద్ర ట్రేడర్స్, శ్రీ వెంకట రాజరాజేశ్వరి ట్రేడర్స్, పలు ఎరువుల దుకాణాలను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సరైన ధరలకు అందుతున్నాయా లేదా అన్న దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాలలో నిల్వలు, విక్రయ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలు, లైసెన్సుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్... తనిఖీల సమయంలో కొన్ని దుకాణాల్లో రికార్డుల నిర్వహణలో లోపాలు, స్టాక్ వివరాల్లో వ్యత్యాసాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ వంటి లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ అంశంపై సమగ్ర నివేదికను సమర్పించాల్సిందిగా ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా సంబంధిత దుకాణాలపై తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులను మోసం చేసే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎరువుల విక్రయంలో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు అందించాలని దుకాణదారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎమ్మిగనూరు వ్యవసాయశాఖ అధికారి ఖాద్రీ, ఏ ఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణతో పాటు పర్యావరణ పరిరక్షణపై ఎస్పీ ఫోకస్

**నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి**

**పాత నేరస్థులపై నిఘా పెంచాలని ఆదేశం**

**చెట్లు నాటితే ప్రశాంత వాతావరణం**

**ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచన**



**బాపట్ల మే 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో ప్రాపర్టీ నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, నేరస్థులను త్వరితగతిన గుర్తించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం బాపట్ల జిల్లా సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, రికవరీ వివరాలను సమీక్షించారు.స్టేషన్ ఆవరణలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలించిన ఎస్పీ, చట్టపరమైన ప్రక్రియ వేగవంతం చేసి అసలైన యజమానులకు త్వరితగతిన అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నమోదైన దొంగతనం కేసుల రికవరీ శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. గతంలో ప్రాపర్టీ నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి పంపింగ్ సిస్టంను ప్రారంభించిన ఎస్పీ, కొబ్బరి మొక్కను నాటి పచ్చదనం పెంపుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. చెట్లు పెరగడం వల్ల కార్యాలయాల పరిసరాల్లో ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల్లో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలని సూచించారు.ఇదిలా ఉండగా రానున్న నాలుగు రోజుల పాటు జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టుకుంటూనే విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, ఇన్‌స్పెక్టర్ పి. ప్రేమయ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి. నారాయణతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**బుట్టాయగూడెం మే21(ప్రజాజ్యోతి):-** భారత వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు ఈనెల 24వ తేదీ వరకు అధిక ఉష్ణోగ్రతలు వడగాల్పులు సంభవించే అవకాశం ఉన్నం దున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహశీల్దార్ ఎస్ రాధా కృష్ణ సూచిం చారు. ఈ మేరకు గురువారం తాసిల్దార్ రాధాకృష్ణ పత్రిక ప్రకటన విడుదల చేశారు. వడగాల్పుల ప్రభావం నుండి రక్షణ పొందేం దుకు ప్రజలు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు అవసరం లేకుండా బయటకు తిరగకుండా ఉండాలని కోరారు.ప్రజలు తగినంత నీరు,ఓఆర్ఎస్, మజ్జిగ,నిమ్మరసం, గంజినీరు వంటి ద్రవప దార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచిం చారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భి ణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో తలకు గుడ్డ కట్టుకోవడం పలుచని కాటన్ దుస్తులు ధరించడం మంచిదని సూచించారు.గ్రామ సచివాల యాలు, అంగనవాడి కేంద్రాలు, ఇతర ప్రజా ప్రదేశాలలో త్రాగునీటి సౌకర్యాలు అందు బాటులో ఉంచేందుకు సంబంధిత అధికా రులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యశాలకు తరలించి చికిత్స అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అన్ని గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాలలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని తహశీల్దార్ ఆదేశించారు.

# అనంతగిరిమండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు భీమరాజుకు తాత్కాలకంగా అధ్యక్ష బాధ్యతలు.



**అనంతగిరి మండలం. మే 21. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారా మరాజు జిల్లా. అనంతగిరి మండలం తెలుగుదేశం పార్టీ అధ్య క్షుడు సోవేరి సుబ్బా రావుకు కొద్దిరోజుల నుండి ఆరోగ్య పరిస్థితి బాగోలేని కారణంగా కొన్ని రోజులు వరకు విశ్రాంతి అవసరమని వైద్యు లు సలహా అందించిన నేప థ్యంలో అధ్యక్షుడికి విశ్రాంతి అవసరం కనుక పార్టీ కార్య కలాపాలు స్తంభిం చకుండా ముందుకు సాగాలి గనుక తాత్కాలకంగా పార్టీ అధ్యక్ష బాధ్యతలు మండల తెలుగ దేశం పార్టీ ఉపాధ్యక్షులు భీమ రాజుకు కొద్ది రోజులు వరకు అప్పగించడం జరుగు తుందని తెలుగుదేశం పార్టీ అరకు నియో జకవర్గ ఇన్చార్జి దో న్నుదొర ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం పార్టీ నాయకులు. కార్యకర్తలు అభిమానులు గమనించాలని దొరవిజ్ఞప్తి చేశారు. అధ్యక్షుడు సుబ్బారావు అంగీకారంతోనే ప్రకటన జారీ చేయడం జరిగిందనీఅన్నారు.

# ఎటపాక నూతన సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు




**ఎటపాక, మే 21 (ప్రజాజ్యోతి):** ఎటపాక సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన వి. కృష్ణను గురువారం తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, రాష్ట్ర నాయకులు ముప్పా శ్రీనివాస్ తదితరులు సీఐ కృష్ణను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ, నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుబల్లి సాయి, బాచినేని మల్లేశ్వరరావు, చంద్ర రఘుతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన జర్నలిస్ట్ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుతున్నాను.



**నంద్యాల:మే=21ప్రజాజ్యోతి**

రాష్ట్రంలో మనజర్నలిస్ట్ ల సమస్యలను పరష్కరించు కోవాలని కోరుతున్నాను. అంతేకాకుండా మన యొక్క డిమాండ్స్ ఏమున్నాయో వాటిని పరిష్కరించే దిశగా ప్రయాణం చేయాలని. లేదా పోరాటాల ద్వారా పరిష్కరించాలని నా యొక్క విజ్ఞప్తి. జర్నలిస్టుల పై దాడులు జరిగిన ప్రభుత్వం పటిపట్టనంట్లు యవహరిం చడం ఇంటి స్థలాలు లేవు ఇండ్లు లేక బాడిగ కట్టలేక ఎంతో మంది జర్నలిస్టుల బాదలు వర్ణననితం అబాదలు మాటల్లో చెపలేము ఇంక్క ఎన్నో సమస్యల తో సతమతంఅవుతున్నారు మన యొక్క డిమాండ్స్ ఏమున్నాయో ప్రభుత్వం తో ఏ విధంగా పనిచేయించుకోవాలో జర్నలిస్టు అందరు మనసుపెట్టి ఆలోచించాలని.కోరుతున్న. మన యొక్క డిమాండ్స్ ఎన్ని ఉన్నా అన్నింటిని. ఒక్కొక్కసమస్యను పరిష్కరించే విధంగా అలోసిచ్చాలని నామనవి మన జర్నలిస్ట్ అందరూ ఒక్క తాటిపైకి రావాలని/వస్తారని/ఆలోచించాలని/కలిసి పని చేయాలని/అన్ని యూనియన్లు కలుపుకొని/ఆ విధంగా పనిచేస్తే/అందరం కలిసికట్టుగా తోడుంటే బల్లం పెరుగుతుంది మన డిమాండ్ల సాదించు కోవచ్చు.అని మనవి చేస్తుంన్నాను మి జర్నలిస్ట్ యస్.భాస్కర్.

# కలెక్టర్ జి.రాజకుమారి గణియా గారిని మర్య దపూర్వకంగా కలిసి శుబాకాంక్షలు తెలిపిన జేసి.సూరజ్ ధనుంజయ్



**నంద్యాల :మే=21 ప్రజాజ్యోతి** గురువారం (21-05-2026) కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా గారిని మర్యాదపూర్వకంగా కలిస శుభాకాంక్షలు తెలిపిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.

# కడప ఎయిర్‌పోర్ట్‌లో యువనేత నారా లోకేష్ గారికి ఘన స్వాగతం



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ మే 21 (ప్రజా జ్యోతి)** కడప జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ గారికి కడప విమానాశ్రయంలో బద్వేల్ నియోజ కవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ రితేష్ రెడ్డి గారు సాదర స్వాగతం పలికారు. కూటమి అఖండ విజయం సాధించి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన తర్వాత తొలిసారి కడపకు విచ్చేసిన మన లోకేష్ గారికి ఎయిర్‌పోర్ట్ వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు మరియు కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరై అపూర్వ స్వాగతం పలికారు.

# రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా పూర్తి చేయాలి

నందవరం గ్రామంలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జాయింట్ కలెక్టర్

రైతుల సమస్యలు తెలుసుకొని, సర్వే సిబ్బంది పలు సూచనలు సూచించిన జేసీ

జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



**నందవరం మే 21(ప్రజా జ్యోతి ):** రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. గురువారం నందవరం మండలం నందవరం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను జాయింట్ కలెక్టర్ సర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వ్యవసాయ భూములను సందర్శించి, సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్...భూ సరిహద్దుల నిర్ధారణ, ఫీల్డ్ మ్యాపింగ్, రికార్డుల పరిశీలన వంటి అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో నేరుగా మాట్లాడి, సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, సందేహాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే కార్యక్రమం రైతులకు భూసంబంధిత వివాదాలు లేకుండా స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ పూర్తి పారదర్శకతతో, ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, రైతుల సమక్షంలోనే భూ సరిహద్దులను నిర్ధారించాలని సర్వే బృందానికి సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి అభ్యంతరాలను వెంటనే నమోదు చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, భూ రికార్డులను ఆధునీకరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ వహాబ్ , ఉప తహశీల్దార్ మహేష్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, రెవెన్యూ సర్వే అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రైతులకు విత్తన గుళికలు తయారీపై అవగాహన కార్యక్రమం







**జి సిగడాం, ప్రజాజ్యోతి న్యూస్:** శ్రీకాకుళం జిల్లా రణస్థలం డివిజన్ జి సిగడాం మండలం మద్రివలస , టంకాల దుగ్గివలస గ్రామములో రైతులకు విత్తన గుళికలు (సీడు ఫెల్లెజేషన్) తయారీ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్ అయినటువంటి వెంకటరమణ మాట్లాడుతూ విత్తన గుళికల విధానం వల్ల సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు వచ్చిన మొలక శాతం మెరుగ్గా ఉంటుందని తెలిపారు.వర్షాలు కురిసిన వెంటనే మంచి మొలకలు వస్తాయని వివరించారు.భూమి ఎల్లప్పుడు పచ్చని పంటలతో భూమి కప్పబడి ఉండడం వల్ల తేమ శాతం, జీవ వైవిధ్యం పెరుగుతుందని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో జి సిగడాం మండలం ఎంపిడిఓ రామకృష్ణ , ఏ .ఈ.ఓ వెంకటరమణ , రైతులు, లీడ్ ఫార్మర్స్, సి.డి.ఎఫ్ , ఐ .సి.ఆర్.పి.ఎస్ పాల్గొన్నారు.

# బ్రహ్మంగారిమఠం మాడవీధులు మరియు రధశాలను పరిశీలించిన వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారు







**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి మే 21** మండల కేంద్రంలోని గురువారం ఉదయం 5.30 సమయం సమయం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం మఠాధిపతులు వీరధర్మజ వేంకటాద్రిస్వాములవారు మఠం మాడవీధులను మరియు రథం పరిసర ప్రాంతాలను మరియు టీటీడీ రూములను మరియు టిటిడి పరిసర ప్రాంతాలను మరియు కళ్యాణ కట్ట పరిసర ప్రాంతాలను మరియు నిత్యాన్నదాన పరిసర ప్రాంతాలను ఆకస్మికంగా వెళ్లి తనిఖీ చేసి ఎప్పటికప్పుడు ప్రతిరోజు మఠం పరిసర ప్రాంతాలన్నీ కూడా శుభ్రంగా ఉంచాలని అక్కడ ఉన్నటువంటి మఠం సిబ్బందికి ఆదేశించడం జరిగినది.

# రైతుల పంట పొలాల్లోకి దారి ఏర్పాటు చేయాలి



తెలుగుగంగ కాలవకు వంతెనుఏర్పాటు చేసి రైతులను

ప్రమాదలనుండి కాపాడాలి:-సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్

**బ్రహ్మంగారి మఠం- ప్రజా జ్యోతి మే 21** మండల పరిధిలోని బ్రహ్మ సాగర్ సమీపంలో ఉన్నరాచెరువు క్రింద 100 ఎకరాల్లో రైతులు భూమినీ సాగు చేసుకుంటున్నారు. బ్రహ్మంగారి మఠం, బసవాపురం మదిరెడ్డిపల్లి, యాదవ్ నగర్ గ్రామల చెందిన రైతులకు వ్యవసాయ భూములు ఉన్నాయని వాటి దగ్గరకు వెళ్లాలంటే దారి లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, సిపిఐ, మండల కార్యదర్శి పెద్దలపల్లె ప్రభాకర్ పేర్కొన్నారు గురువారం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇనుప వంతెన ను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ్ నగర్, మద్దిరెడ్డి పల్లె, బసాపురం ప్రాంతం చెందిన రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారిలేక అవస్థలు పడుతున్నారని, అధికారులు ప్రజాప్రతినిధులు రైతుల సమస్య పైన దృష్టి పెట్టాలని అనేకమార్లు రైతులు చెప్పిన పట్టించుకోవడంలేదని, తెలుగు గంగ కుడి కాలువ వద్ద బ్రిడ్జి నిర్మించకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఒక ఇనుప కమ్మీపై రైతులు వెళుతుంటే అంత ఎత్తునుండి కింద పడితే ప్రమాదం సంభవిస్తుందని తెలిసి కూడా రైతులు గత్యంతరం లేక అదే బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నారు.ఇప్పటికైనా బ్రహ్మ సాగర్ కుడి కాలువ పై వంతెన నిర్మించకపోవడంతో రా చెరువు కింద వ్యవసాయ భూములు ఉన్న రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పొలం పనికి కూలీలు రావాలన్నా ట్రాక్టర్ రావాలన్నా ఎవరు రావటం లేదని చుట్టూ మూడు నాలుగు కిలోమీటర్లు తిరిగి రావాల్సిందేనని అదేవిధంగా ఎన్నో కష్టాలు పడి తీరా పంట చేతికొస్తే పంట కొనేందుకు వ్యాపారస్తులు బ్రిడ్జి లేని కారణంగా మా పంట కొనేందుకు ముందుకు వస్తా లేరు అని మా దాన్నేమంతా కూడా దారి మార్గానికి చేర్చామని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు ఈ ప్రాంత ప్రజల పైన దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని అయన కోరారు.లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసనకార్యక్రమం చేపడతామని అయన హెచ్చరించారు.

# దాతల ఔదార్యం.. అభాగ్యులకు సాయం భీమారావు

పోడూరు మండల మాల మహానాడు గౌరవాధ్యక్షులు బుడితి

భీమారావు తండ్రి అప్పులు 3వ వర్ధంతి అనాధ వృద్ధులకు అన్నదానం




పోడూరు, ( ప్రజాజ్యోతి), – మే –21 : దాతల ఔదార్యం పేదలకు సాయం అని పోడూరు మండల మాల మహానాడు గౌరవ అధ్యక్షులు బుడితి భీమారావు అన్నారు. కోడూరు మండల మాల మహానాడు గౌరవ అధ్యక్షుడు బుడితి భీమారావు తండ్రి బుడితి అప్పులు 3వ వర్ధతి సందర్భంగా పాలకొల్లు ప్రశాంతి నిలయం అనాథ వృద్ధుల ఆశ్రమంలో 25 మందికి ఉదయం పూట, సాయంత్రం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోడూరు మండలం మాల మహానాడు అధ్యకుళ్ళు బూడితీ భీమారావు గారు, కవిటం గ్రామం మాజీ ప్రెసిడెంట్ తరపట్ల మోహన్ రావు, సరేళ్ళ సత్యనారాయ, ఈద రాతంరాజు, మాంద్రు కృష్ణమూర్తి, కుటుంబ సభ్యులు రాజు, ప్రభాకర్, ఇతరులు హాజరై కార్యక్రమం విజయవంతం చేశార.

# జిన్నూరు శాఖా గ్రంధాలయాన్ని సందర్శించిన

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి.



**పాలకొల్లు ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. మే 21**.జిన్నూరు శాఖా గ్రంథాలయాన్ని పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎమ్ శేఖర్ బాబు వార్షిక తనిఖీ నిమిత్తం గురువారం సందర్శించారు. . ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరములో విద్యార్థులకు నిర్వహిస్తున్న విజ్ఞాన కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వేసవి విజ్ఞాన శిబిరంలో ఇంద్రజాల ప్రదర్శన చేసి విద్యార్థి విద్యార్థులకు తన మేజిక్ ప్రదర్శనతో ఎంతో ఆకట్టుకున్న ఉపాధ్యాయులు మెజీషియన్ గండవల్లి మధుసూదనరావును శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం జిన్నూరు శాఖా గ్రంథాలయము నందు గ్రంథాలయం రికార్డులను, గ్రంథాలయమునకు అనుబంధము గా ఉన్న వడ్లవాని పాలెం, వేడంగి గ్రామాలలోని పుస్తక పంపిణీ కేంద్రాల వార్షిక తనిఖీ జరిపారు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు డి దుర్గామల్లేశ్వరి, కాంపౌండర్ బి లక్ష్మీ నరసమ్మ, సి అర్ పి కాటం భారతి, బాల సంస్కార్ వాలంటీర్ బండారు వెంకట రమణ, జిన్నూరు పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ ఎలకల శ్రీనివాస్, పోడూరు మండల యస్ సి సెల్ అధ్యక్షులు చొప్పల శ్రీనివాస్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు బూడి కృష్ణ, సెక్రటరీ తాళాబత్తుల వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఆచంట సాయి రామ్ గ్రంథ పాలకురాలు బత్తుల జోగారత్నం బీడీసీ లు కొట్టి రామం, టి ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

# ఇసుక దోపిడీ.అక్రమ రవాణాపై ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తాం.

గిరిజనులు వెల్లడి.

**అనంతగిరి మండలం. మే 21. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం కాశీపట్నం.చిలకల గెడ్డ గ్రామ పంచాయతీల పరిధి కాశీపట్నం. జిలుగులపాడు గ్రామాల సరిహద్దు గోస్తాని నదీ జలాల నుండి ఇసుక అక్రమ తవ్వకాలు. దోపిడీ.అక్రమ రవాణాపై శుక్రవారం నాడు పాడేరు ఐ.టీ.డీ.ఏ కార్యాలయంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడం జరుగుతుందని గిరిజను లుతెలిపారు. ఇసుక. దోపిడీ అధిక ధరలు.అక్రమ రవాణా నివారించాలనేదే ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని తెలిపారు.

# చెర్వు మాధవరం గ్రామపంచాయతీ అధికారులు లారా...!!!

లిమా గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించండి...!!

**జి.కొండూరు :( మే 21ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** జి.కొండూరు మండల పరిధిలోని చెర్వు మాధవరం గ్రామానికి చెందిన పలువురు గ్రామ ప్రజలు మా గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అలాగే గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతూ... గ్రామపంచాయతీ అధికారులకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చెర్వు మాధవరం గ్రామానికి చెందిన కే. అంజయ్య, జి.నాగలక్ష్మి, పి.మేఘన,ఎం.అన్నపూర్ణ, కె.మూర్తమ్మ తదితరులు పత్తికాముఖంగా మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు ఒక్కరోజు వస్తే రెండు రోజులు తాగునీరు రావడంలేదని, అలాగే ఇంటింటి వాటర్ పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు కానీ నేటికీ అమలు జరగలేదని, గ్రామ సమస్యలతో గ్రామపంచాయతీ అధికారులకు వినపత్రాన్ని అందచేయడం జరిగిందని గ్రామస్తులు పత్రికా ముఖంగా తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీని పవన్ కళ్యాణ్ ను అబాసు పాలు చేయడానికి జగన్ మోహన్ రెడ్డి కుట్ర...!!

**అక్కల రామ్మోహన్ రావు గాంధీ...!!**
**జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి..!!**



**జి.కొండూరు :(మే 21ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** మైలవరం నియోజకవర్గ పరిధిలోని కొండపల్లిలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) ఇంటి ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్ రావు గాంధీ మాట్లాడుతూ – కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ పవన్ కళ్యాణ్ ను కూటమి ప్రభుత్వం నుండి విచ్ఛిన్నం చేయడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత జగన్ మోహన్ రెడ్డి మరియు ఆ పార్టీ అనుచరులు కొందరు అవాకులు...చవాకులు మాటలతో పవన్ కళ్యాణ్ పై దుష్ప్రచారం మొదలు పెట్టి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని చూసి రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్, కేఎస్ ప్రసాదు లాంటివారు భయపడుతున్నారన్నారు. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉంటే ఓటమి ప్రభుత్వాన్ని ఓడించడం కష్టమవుతుందని భయపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా అక్కల రామ్మోహన్ రావు (గాంధీ ) మాట్లాడుతూ – గడిచిన ఈ రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం నీతివంతమైన పాలన అందించారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుండి అనేక నిధులు మంజూరు అవుతున్నాయన్నారు. కేంద్రం రాష్ట్రానికి అందిస్తున్న సహకారం వలన రాష్ట్ర అభివృద్ధి చెబుతుందని ఈ అభివృద్ధి వలన వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఓడించడం కష్టమవుతుందని భయంతో ఏదో విధంగా కూటమిలో జనసేన పార్టీని లేకుండా చేయాలనే దురుద్దేశంతో... ఇటు జగన్మోహన్ రెడ్డి అలాగే మాజీ మంత్రి రోజా,పేర్ని నాని ఇలా అనేకమంది పవన్ కళ్యాణ్ పై తప్పుడు ప్రచారాలు చేస్తూ... కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ప్రజలు అన్ని గమనిస్తున్నారని అక్కల రామ్మోహన్ రావు( గాంధీ) మండిపడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మాటలు రాష్ట్ర ప్రజలు నమ్మడం లేదని ఉద్దేశంతో... జగన్మోహన్ రెడ్డి ప్రొఫెసర్ నాగేశ్వర్ కి, కేఎస్ ప్రసాద్ కి డబ్బులు ఇచ్చి పవన్ కళ్యాణ్ పై అసత్య ప్రచారాలకు కంకణం కట్టుకున్నానని రామ్మోహన్ రావు( గాంధీ )ఆరోపించారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్ పై మా పార్టీ కి అపరమైన గౌరవం ఉందని, కానీ ఎలాంటి ఆధారాలు లేని ఎలాంటి సాక్ష్యం లేని, దుర్మార్గపు మాటలను నాగేశ్వర్ నోటి వెంట రావడం అన్యాయం అన్నారు. నాగేశ్వర్ పై ఉన్న గౌరవాన్ని అతనికి అతనే దిగదార్చుకున్నారన్నారు. ఇప్పటికైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరాదర అసత్య ఆరోపణలు మానుకోవాలని అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# హామీలకే పరిమితమైన విలేకరుల సమస్యలు

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కలగానే మిగిలిపోయాయి

**కంబదూరు, మే 21: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల తరఫున నిరంతరం పోరాడుతున్న జర్నలిస్టుల సమస్యలు మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం బాధాకరమని కంబదూరు మండలంలోని విలేకరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, అధికారులు మారినా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు మాత్రం మాటలకే పరిమితమయ్యాయని వారు వాపోతున్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని పలుమార్లు ప్రభుత్వాలు ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు అవి అమలు కాలేదని తెలిపారు. అలాగే ప్రెస్ క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయింపుపై కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనుమతులు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి సమస్యను వెలికితీసి అధికారుల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సమస్యల పట్ల మాత్రం ఎవరూ స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన విలేకరులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కంబదూరు మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ సర్వే నిమిత్తం వచ్చిన అప్పటి జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ను కలిసి కంబదూరు మండలం కేంద్రంలో అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం తోపాటు ప్రెస్ క్లబ్ కోసం స్థలం కేటాయించాలని విలేకరులు వినతి పత్రం సమర్పించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం కనిపించ కపోవడంతో జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యతో పాటు ప్రెస్ క్లబ్ స్థలం కేటాయింపు సమస్యను పరిష్కరించాలని కంబదూరు విలేకరులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# నేడు విద్యార్థులకు డిగ్రీతో పాటు నైపుణ్యం కూడా అవసరం

**-- ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్**

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 21 (ప్రజా జ్యోతి)** నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. నేడు శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ ఒ పీజీ కళాశాల (అటానమస్), బద్వేల్‌లో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచం ఎంతో విశాలమైందని, విద్యార్థులు తీసుకునే మంచి నిర్ణయాలే వారి భవిష్యత్తుకు మార్గదర్శక మవుతాయని ఆయన సూచించారు. విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ గ్రూప్ కమాండర్, ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్ తిరుపతి కల్నల్ గంగా సతీష్ ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన ప్రయాణమే జీవితంలో ఉన్నత గమ్యాలను చేరుస్తుందని అన్నారు. అలాగే ఎంవీసీ అకాడమీ, హైదరాబాద్ చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పి. రంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ట్రైనీ) శ్రీ పల్లెం శ్రీరామచంద్ర శ్రీనివాస్ గౌరవ అతిథులుగా పాల్గొని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే విధంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ, కళాశాల డీన్ డాక్టర్ అశోక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాల ఓబులేసు, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షాహిన, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. రామసుధ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# కడప విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికిన సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 21 (ప్రజా జ్యోతి)** కడప జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కు కడప విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కడప డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మంత్రి లోకేష్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిన తర్వాత, అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యున్నత బాధ్యతలు చేపట్టిన అనంతరం నారా లోకేష్ తొలిసారి కడప జిల్లాకు విచ్చేయడంతో విమానాశ్రయం పరిసరాలు పండగ వాతావరణాన్ని తలపించాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ వద్దకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ ప్రియతమ యువనేతకు అపూర్వ స్వాగతం పలుకుతూ విమానాశ్రయం వెలుపల అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మరియు కార్యకర్తలు పాల్గొని లోకేష్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

**ఎమ్మెల్యే నక్క ఆనందబాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల స్వీకరణ**



**బాపట్ల మే 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించి పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వేమూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే నక్క ఆనందబాబు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని తెలిపారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సాధారణ పీజీఆర్ఎస్‌తో పాటు, ప్రతి శుక్రవారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు స్థానికంగానే సమస్యల పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వేమూరు నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు అన్ని శాఖల మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే మీకోసం పోర్టల్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉందన్నారు.

# దళితులపై జరిగిన దౌర్జన్యాలకు వైసిపీ పాలనే నిదర్శనం.

**ఎమ్మెల్యే ఎంజీ ఆర్.**



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్. పోతపట్నం** దళితులపై జరిగిన దౌర్జన్యాలకు వైసీపీ పాలనే నిదర్శనం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఎంజీఆర్ మాట్లాడుతూ... వైసీపీ పాలనలో దళితులపై దాడులు, హత్యలు, అవమానాలు, అణచివేతలు పెరిగిపోయాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారుల దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య ఘటన, డాక్టర్ సుధాకర్ పై జరిగిన అమానుష వేధింపులు వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రశ్నించిన వారిని బెదిరించడం, దళితుల గొంతు నొక్కేయడం వైసీపీ పాలనలో సాధారణమైందని విమర్శించారు. దళితుల సంక్షేమం పేరుతో మాటలు చెప్పిన జగన్ రెడ్డి, వాస్తవానికి దళితులపై దాడులు పెరిగేలా చేశారని మండిపడ్డారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళిత యువత భవిష్యత్తుతో ఆటలాడారని ఆరోపించారు. వీధి సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్ వంటి ఘటనలను ప్రజలు మరువరని, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మే 19 నుండి 21 వరకు నిర్వహించే సంస్మరణ కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని దళితులపై జరిగిన అన్యాయాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# దురదకుంట ఏపీజీబీ బ్యాంకులో కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు





**కంబదూరు, మే 21: (ప్రజా జ్యోతి) న్యూస్** కంబదూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలు కళ్యాణదుర్గం పరిధిలోనే దురదకుంట ఏరియా బ్యాంక్ పరిధిలో వస్తాయి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రైతులు, వృద్ధులు, వికలాంగులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో బ్యాంకు సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెర్లోపల్లి, ఐపార్సపల్లి, పాళ్లూరు, దేవేంద్రపురం, గుళ్లం, గొల్లపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ బ్యాంకు పరిధిలోకి వస్తున్నారు. రైతులు తమ క్రాప్ లోన్ రెన్యూవల్స్ కోసం నానా ఇబ్బందులు పడి బ్యాంకుకు వస్తే, అక్కడ సిబ్బంది "నేను ఆడిందే ఆట, పాడిందే పాట" అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకు ముందు వేచి ఉన్నా సామాన్య రైతుల పనులు సక్రమంగా జరగడం లేదని, అదే సంపన్నుల పనులు మాత్రం క్షణాల్లో పూర్తవుతున్నాయని రైతులు మండిపడుతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు అడుగడుగునా అవమానాలు ఎదురవుతున్నాయని, కనీసం తమ పనులు చేసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ఇటీవల కొంతమంది రైతులు రిన్యూవల్ చేసుకుని అదనంగా పెరిగిన లోన్ మొత్తాలు ఇప్పటికీ తమ ఖాతాల్లో జమ కాలేదని ఆరోపిస్తున్నారు. ఏటీఎం సౌకర్యం కల్పించాలని కోరగా "మా దగ్గర ఏటీఎం కార్డులు అడగగా కార్డులు లేవు" అంటూ బ్యాంకు సిబ్బంది చేతులెత్తేశారని రైతులు తెలిపారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారి ఏడాది గడిచినా ఇప్పటికీ పాత అకౌంట్ బుక్ లు కొనసాగుతున్నాయని విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రాకూడదని సూచిస్తున్నప్పటికీ, బ్యాంకు సిబ్బంది మాత్రం ఆ సూచనలను పట్టించుకోకుండా ప్రజలను గంటల తరబడి బ్యాంకు ముందు అరుబయట వేచి ఉండేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై రైతులు జీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందించిన జీఎం, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# ఎండలపై అప్రమత్తం గ్రామంలో ఆరోగ్య శిబిరం

పెదవడ్లపూడిలో ఉచిత వైద్య పరీక్షలు

-- వడదెబ్బ నివారణపై నిపుణుల సూచనలు







**బాపట్ల మే 21 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పెదవడ్లపూడి గ్రామంలో నిర్వహించిన వేసవి ఆరోగ్య శిబిరం గ్రామ ప్రజల్లో విశేష స్పందన పొందింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన పెదవడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. ఎ. సతీష్ కుమార్ మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గి అలసట, డీహైడ్రేషన్, వడదెబ్బ, తలనొప్పి, వాంతులు వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, శ్రామికులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారుగ్రామ ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన ఆయన, దాహం లేకపోయినా తరచూ నీరు తాగాలని సూచించారు. కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయని చెప్పారు. అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ తప్పడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎం. రమాదేవి మాట్లాడుతూ ఓఆర్ఎస్ వినియోగం, పరిశుభ్రమైన తాగునీటి అవసరంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వీధి ప్రక్కన విక్రయించే కలుషిత పానీయాల వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నీటి సంరక్షణ, చెట్ల పెంపకం వంటి చర్యలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎం. రమేష్ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో బయట తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డా. కె.ఎస్.ఆర్. పాల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే డా. ఏ. లలిత మాట్లాడుతూ బయటకు వెళ్లేటప్పుడు తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, పలుచని పత్తి దుస్తులు వేసుకోవడం మంచిదన్నారు. చిన్నపిల్లలను ఎక్కువసేపు ఎండలో ఆడనివ్వకూడదని సూచించారు. ఈ శిబిరంలో వ్యవసాయ కళాశాలకు చెందిన 52 మంది విద్యార్థులు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# ఎక్కడ చూసినా.. ధాన్యం కుప్పలే..



**నిర్మల్ :** ధాన్యాన్ని అమ్ముకొనేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నరు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోపాటు ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారుతున్నది. 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో 30 శాతానికి మించి కొనుగోళ్లు జరగలేదు. కొన్ని చోట్ల పేరుకే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. నేటికీ ఒక్క బస్తా కూడా కోనుగోలు చేయలేదు. దీంతో జిల్లాలో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 1,17,085 ఎకరాల్లో వరి సాగవగా.. 1.83 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా ఇప్పటి వరకు 295 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. ఇప్పటివరకు 205 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. మిగతా సెంటర్లను ప్రారంభించినప్పటికీ హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు జరపడం లేదు. ధాన్యం సేకరణ లక్ష్యం 1.83 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటివరకు 47,136 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇంకా.. 1,35,864 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. జిల్లా వ్యాప్తంగా కోనుగోళ్లను ప్రారంభించి దాదాపు 20 రోజులు అవుతున్నా.. ఇప్పటి వరకు కేవలం 30 శాతం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.112 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.42 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారు. అంటే ఇంకా రూ.70 కోట్ల వరకు రైతులకు చెల్లించాలి.

**పేరుకుపోయిన వడ్ల కుప్పలు**

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఎటు చూసినా వడ్ల కుప్పలే దర్శనమిస్తున్నాయి. కొనుగోలు సెంటర్ల వద్ద రైతులు వడ్లను తీసుకొచ్చి కుప్పలుగా పోశారు. ఒకవైపు ఉరుములు మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో రైతులు వడ్ల కుప్పలపై టార్పాలిన్లను కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. పక్షం రోజులుగా ఇక్కడి సెంటర్‌కు వడ్లను తీసుకొచ్చామని, ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని నిర్మల్ మండలం ముజ్గి గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. ఎప్పుడు కొంటారోనని ఎదురుచూస్తూ రోజుల తరబడి వడ్ల కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాల ముప్పుతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు చేపట్టలేకపోతున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కనీసం గన్నీ బ్యాగులైనా ఇస్తే తామే వడ్లను నింపుకుంటామని రైతులు మొర పెట్టుకున్నా.. కొన్నిచోట్ల కేంద్రాల నిర్వాహకులు బ్యాగులు ఇవ్వడం లేదు. మరోవైపు వడ్లను తరలించేందుకు లారీల కొరత ఉన్న కారణంగా కావాలనే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న ధాన్యాన్ని మిల్లర్లు తీసుకొనేందుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇలా అనేక రకాల కొర్రీలతో కొనుగోలు ప్రక్రియ మందకోడిగా సాగుతున్నది. గత కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచే కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని రైతులు మండిపడుతున్నారు.

**నిర్మల్ జిల్లాలో..**

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం : 1.83 లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసింది : 47,136 మెట్రిక్ టన్నులు
కొనాల్సింది : 1,35,864 మెట్రిక్ టన్నులు

# ఆర్. కృష్ణాపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు



**ఆళ్లగడ్డ (ఆర్.కృష్టాపురం) ప్రజాజ్యోతి :మే=21** ఆళ్లగడ్డ మండలం పరిధిలోని ఆర్. కృష్ణాపురం రైతు సేవ కేంద్రం (ఆర్ యస్ కే)లో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాల్సిన అవసరంపై అధికారులు వివరించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వై. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యం కాపాడటంతో పాటు రైతులకు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. అలాగే ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారులు (ఎడిఎ ఎఓ) కిషోర్ కుమార్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# టిడిపి యువ నేత రితేష్ రెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు టిడిపిలో చేరిక




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ మే 21 (ప్రజా జ్యోతి)** బద్వేల్ నియోజకవర్గం, గోపవరం మండలం, రాచాయపేట పంచాయతీ రాచాయపేట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 40 వైయస్సార్సీపీ కుటుంబాలు ఆ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఆకర్షితులై ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరారు. బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కె. రితేష్ రెడ్డి గారు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రితేష్ రెడ్డి గారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నామని, పార్టీ నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ భారీ చేరికల కార్యక్రమంలో ౼్రా××జ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి గోపవరం మండలం జడ్పీటీసీ జయరాం రెడ్డి గోపవరం ఎంపీపీ కొండయ్య గోపవరం వైస్ ఎంపీపీ రామ్మోహన్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, రసాయపేట శివారెడ్డి మరియు గోపవరం మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా జడ్పిటిసి జన్మదిన వేడుకలు జరిపిన ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.**పాతపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో హిరమండలం జడ్పిటిసి,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి బుచ్చిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆధ్వర్యం కేక్ కట్ చేసి బుచ్చిబాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ప్రజల సమస్యల పరిష్కారంలో, పార్టీ బలోపేతంలో బుచ్చిబాబు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న ఉచ్చిల రవి



**కాట్రేనికోన మే 21ప్రజాజ్యోతి** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంకాట్రేనికోన మండల పరిధిలోని ఉప్పూడి ఎర్రాయి చెరువు గ్రామం లో గురువారం పెయ్యల వారి వివాహ వేడుక ఘనంగా జరిగింది. వరుడు చంటి బాబు, వధువు కెజియా లను వరుని తల్లిదండ్రులు రత్నం రాజు, దుర్గ , వధువు తండ్రి భేతాల ఏసుదాసు , గ్రామ పెద్దలు ఉచ్చిల రవి కుమార్, బండారు యేసు, శ్యామ్యూల్ జోషి, పాస్టర్ ఇస్సాకు, అబ్రహం, పెయ్యాల రాజు బీర జాన్, పెయ్యాల ఈశ్వర రావు, కొంకి సూర్య నారాయణ, పెయ్యాల సురేష్ బాబు, పెనుమాల రమేష్ , బంధు మిత్రులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వాదించారు

# కోవెలకుంట్ల ఆర్టిసి డిపో సమస్యలపై రాయలసీమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి)రాఘవ కుమార్ గారికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం



**కోవెలకుంట్ల:మే=21** ప్రజాజ్యోతి కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోకు రాయలసీమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) రాఘవ కుమార్ కోవెలకుంట్ల కు వచ్చిన సందర్భంగా కోయిలకుంట్ల ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిపో సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐక్యవేదిక నాయకులు బనగానపల్లె కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాలు యాదవ్ ఆధ్వర్యంలో కరీం భాషా ,ఎం సుధాకర్ ,వడ్డే సుబ్బరాయుడు, బండెల ఓబులేసు, బాలు యాదవ్, దండు రామసుబ్బయ్య, రాజు తదితరులు మాట్లాడుతూ కోవెలకుంట్ల డిపో నందు వర్షాకాలంలో వరద నీటిని బయటికి వెళ్లే విధంగా శాశ్వత పరిష్కారం చేయాలి. బస్టాండ్ పరిధిలో పడమటి దిక్కున ఉన్నటువంటి ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించాలి. బస్టాండ్ పరిధిలో సీసీ కెమెరాలు, వీధిలైట్లు, మరుగుదొడ్లు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఫ్రీ బస్సుల్లో మహిళలకు ఆర్టీసీ డ్రైవర్ మరియు కండక్టర్లకు సమన్వయం ఉండేలా వారికి సూచనలు ఇవ్వాలి. స్థానికంగా ఐటిఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్యారేజ్ లో అప్రెంటిషిప్ అవకాశం కల్పించాలి. కోవెలకుంట్ల డిపో నుండి వెళ్లే నంద్యాల ,ఆళ్లగడ్డ, తాడిపత్రి, జమ్మలమడుగు మరియు కర్నూల్ రూట్లలో బస్సు సర్వీసులు పెంచాలి. పచ్చతనం ,పరిశుభ్రత లో భాగంగా ఆర్టిసి డిపో పరిధిలో చెట్లు నాటి పార్కు ఏర్పాటు చేయాలి. గతంలో ఉన్నటువంటి విజయవాడ, బెంగుళూరు, అనంతపురం బస్సులను పునరుద్ధరించాలి. ఈ డిమాండ్లను ఇడిగారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నాగేంద్ర, రవి , నరేష్ ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లయిస్ హమాలీలకు ఏప్రిల్ నెల వేతనాలు తక్షణమే చెల్లించాలి





**ఏఐటీయూసీ డిమాండ్**

**మదనపల్లె మే 21 ప్రజా జ్యోతి** జిల్లాలోని సివిల్ సప్లయిస్ పాయింట్లలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్న హమాలీలకు ఏప్రిల్ నెల వేతనాలు మే 21 జరుగుతున్న ఇప్పటికీ చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు.హమాలీలకు ఏప్రిల్ నెల వేతనం తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయంలోని అసిస్టెంట్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కష్టపడి శ్రమిస్తున్న హమాలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని తెలిపారు.ప్రభుత్వం మరియు సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి హమాలీలకు పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్ నెల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మొదటి వారంలోనే జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు, మహిళా గ్రూపులకు చెల్లింపులు, నిత్యావసర వస్తువుల కొనుగోలు కు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని. అలాగే ప్రతి నెలా మొదటి వారంలోనే హమాలీలకు జీతాలు చెల్లించే విధంగా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదకర పరిస్థితుల్లో కష్టపడి పనిచేస్తున్న హమాలీలకు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకోసం వెంటనే ఈఎస్ఐ పథకం అమలు చేయాలని సాంబశివ డిమాండ్ చేశారు. అనారోగ్య పరిస్థితుల్లో సరైన వైద్య సదుపాయాలు లేక హమాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే దశాబ్దాలుగా శ్రమిస్తున్న అర్హులైన హమాలీలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసి, ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడి, హమాలీల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవా, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరమల, హమాలీలు కుమార్, సురేష్ బాబు, నాగరాజు, రెడ్డీస్ ప్రసాద్, చిన్న రెడ్డప్ప, మోహన్,రాజ,రఫి, ఆంజినేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ బస్సులు ప్రభుత్వమే నిర్వహించాలియూనియన్ డిమాండ్



**ఆళ్లగడ్డ:మే=21 ప్రజాజ్యోతి** ఆళ్లగడ్డ : రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నిర్వహించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం ఆళ్లగడ్డ డిపో గ్యారేజీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యూనియన్ ఉపాధ్యక్షుడు కోటేశ్వరావు ఆధ్వర్యంలో పలు వురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ, ప్రభుత్వ రవాణా రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడపడం కార్మికుల భవిష్యత్తుకు, ప్రజల ప్రయాణ సౌకర్యాలకు హానికరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గడంతో పాటు ఉద్యోగ భద్రత కూడా దెబ్బతింటుం దనిపేర్కొన్నారు. అందువల్ల ఎలక్ట్రిక్ బస్సులను పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనుగోలు చేసి, ఆపరేట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే, రవాణా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏ బకాయిలు, లీవ్ ఎన్క్యాష్మెంట్లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమా వేశంలో ఇతర నాయకులు మాట్లా డుతూ, కార్మికుల సమస్యలను పరిష్కరిం చకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్య క్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, డిపో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుడుములదిన్నె హత్యాయత్నం కేసు ఛేదన ఇద్దరు అరెస్ట్



**-- ముగ్గురు బాల నేరస్థులు అదుపులో**

**ఆళ్లగడ్డ (ఉయ్యాలవాడ) ప్రజాజ్యోతి :మే=21** ఉయ్యాలవాడమండలంలోనితుడుములదిన్నె సమీపంలో జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. ఈ విషయాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 16వ తేదీ రాత్రి సుమారు. 8:15 గంటలసమ యంలోమా యలూరు--తుడుములదిన్నె రహదారిలోని రైల్వే అండర్‌పాస్ వద్ద ఈ ఘటన జరిగింది. తుడుములదిన్నె గ్రామానికి చెందిన టైలర్ ఇమ్రాన్ ట్రాక్టర్‌పై వెళ్తుండగా, ముద్దాయిలు బైక్‌లపై వచ్చి ట్రాక్టర్‌ను అడ్డగించి దాడి చేశారు.ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఇమ్రాన్‌పై క్రికెట్ బ్యాట్లు, రాళ్లతో దాడి చేసి, అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ప్రాణభయంతో ఇమ్రాన్ సమీపంలోని నీటి కుంటలోకి దూకి తప్పించు కున్నాడు.ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న హరిచంద్ర ప్రసాద్ అలియాస్ బద్రి అడ్డుగా రావడంతో, అతనిపై కూడా ముద్దాయిలు కులం పేరుతో దూషిస్తూ దాడి చేసినట్లు పేర్కొన్నారు. గాయపడిన ఇమ్రాన్ ప్రస్తుతం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఫిర్యాదు మేరకు ఉయ్యా లవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసులో భోగ్యం వెంకట స్వామి అలియాస్ బోయ వెంకట స్వామి, పణ్యం మణివర్ధన్ అలియాస్ మణిని పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు బాల నేరస్థులను అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయి కూతురు ఇమ్రాన్‌తో ప్రేమలో ఉందనే అనుమానంతో గ్రామంలో పుకార్లు వ్యాప్తి చేశాడని భావించి, అతనిపై కక్ష పెంచుకుని హత్యాయత్నానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.గురువారం మధ్యాహ్నం ఉయ్యాలవాడ రహదారిలోనిచింతకుంట్ల--పాంపల్లె క్రాస్ వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ బీవీ రమణ, ఎస్ఐ పి. రామిరెడ్డి మరియు సిబ్బంది పంచాయతీదారుల సమక్షంలో ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

# గిరిజన రైతుల సమస్యలపై డా. కాళేశ్వరరావు పుస్తకావిష్కరణ



**కూనవరం, మే 21 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా కూనవరం మండలం మద్రిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డా. ఎం. వి. కాళేశ్వరరావు రచించిన “అగ్రికల్చర్ ఇండెటెడ్‌నెస్ ఆఫ్ ట్రైబల్ ఫార్మర్స్ ఇన్ ఇండియా” పుస్తకాన్ని ఢిల్లీలోని అధ్యయన్ పబ్లిషర్స్ ద్వారా ప్రచురించారు. ఈ పుస్తకాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ కనకాచారి, హైదరాబాద్ ఎంఎల్ఆర్ విద్యాసంస్థల అధినేత మర్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గిరిజన రైతులు ఎదుర్కొంటున్న అప్పుల సమస్యలు, వ్యవసాయ ఇబ్బందులు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను పుస్తకంలో సమగ్రంగా వివరించారని కొనియాడారు. భవిష్యత్తులో గిరిజన వ్యవసాయ అభివృద్ధికి ఈ పుస్తకం మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. చలపతిరావు, స్కాలర్స్, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

**- డీఎస్పీ శ్రీనివాసరావు**




**నంద్యాల (ఆళ్లగడ్డ) ప్రజాజ్యోతి: మే=21** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రతి నిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న బక్రీద్ పండుగను అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవభావంతో, సామరస్యపూర్వకంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చట్టాలు, నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, వదంతులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా హెచ్చరించారు.మతపెద్దలు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా బక్రీద్ పండుగను ప్రశాంతంగానిర్వహించేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు రావ్, ఎస్సై పీరయ్య, ముస్లిం పెద్దలు, విశ్వహిందూ పరిషత్, బజరంగ దళ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో గ్రామాల అభివృద్ధికి కొత్త సర్వే ప్రారంభం!




**నంద్యాల:మే=21 ప్రజాజ్యోతి** ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పంచాయతీ భూములు, రోడ్లు, డ్రైనేజీలు, పశువుల మేత భూములు వంటి అంశా లపై సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. గ్రామాల స్వయం సమృద్ధి లక్ష్యం జియో ట్యాగింగ్‌తో రోడ్ల పర్యవేక్షణ మ్యాజిక్ డ్రెయిన్స్ విస్తరణ నాణ్యమైన గ్రామీణ రోడ్లు పారదర్శక అభివృద్ధి పనులు. పల్లె పండుగ” కార్యక్రమాలతో గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం మరింత వేగం పెంచుతోంది.

## బిజినెస్

### తగ్గిన ఓలా ఎలక్ట్రిక్ నష్టం.. తొలిసారి పాజిటివ్ క్యాష్ ఫ్లో




**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ గత ఆర్థిక సంవత్సరం (2025--26) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.500 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. అయితే, అంతక్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.870 కోట్ల నష్టంతో పోలిస్తే ఈసారి నష్టం 42.5 శాతం తగ్గింది. ఆదాయం 57 శాతం క్షీణించి రూ.611 కోట్ల నుంచి రూ.265 కోట్లకు దిగజారింది. ఆదాయం తగ్గినా, స్థూల మార్జిన్లు మెరుగయ్యాయి. ఇవి వార్షిక ప్రాతిపదికన 13.7% నుంచి 38.5 శాతానికి చేరాయి. పీఎల్ఐ ప్రోత్సాహకాలు, మెరుగైన స్థూల మార్జిన్లు, కఠినమైన వ్యయ నియంత్రణ కారణంగా కంపెనీ చరిత్రలో తొలిసారిగా కార్యకలాపాల నగదు ప్రవాహం పాజిటివ్‌గా మారి క్యూ4లో రూ.91 కోట్లుగా నమోదైంది. ఆటోమొబైల్ వ్యాపారం నుంచి రూ.213 కోట్ల ఆపరేటింగ్ క్యాష్ ఫ్లో, రూ.173 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో (ఎఫ్‌సీఎఫ్) నమోదయ్యాయి. మార్చి త్రైమాసికంలో మొత్తం 20,256 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కంపెనీ విక్రయించింది. ఇక పూర్తి 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ మొత్తం రూ.2,253 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా.. రూ.1,833 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తంలో ఓలా ఎలక్ట్రిక్ మొత్తం 1,73,794 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను డెలివరీ చేసింది.

### ఐపీఎల్ వెలుగులో బెట్టింగ్ 'చీకటి ఆట'!

ఐపీఎల్ సీజన్‌ను ఆసరాగా చేసుకుని భారతీయ క్రికెట్ అభిమానులను పెద్ద ఎత్తున ముంచేస్తున్న ఒక భారీ అక్రమ బెట్టింగ్ నెట్‌వర్క్‌ను ప్రముఖ సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థ 'క్లౌడ్‌సెక్' బట్టబయలు చేసింది. క్లోన్-స్క్రిప్ట్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డీప్‌ఫేక్స్, హ్యాక్ చేసిన ప్రభుత్వ వెబ్‌సైట్లు, మనీ లాండరింగ్ నెట్‌వర్క్‌ల సహాయంతో ఈ ముఠా ఇంతటి భారీ దోపిడీకి పాల్పడుతున్నట్లు సంస్థ తన తాజా పరిశోధనలో వెల్లడించింది. గత వారమే ఐపీఎల్ వీక్షకులను లక్ష్యంగా చేసుకుని నడుస్తున్న నకిలీ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను గుర్తించిన క్లౌడ్‌సెక్, తాజాగా ఈ అక్రమ బెట్టింగ్ ఎకానమీ వెనుక ఉన్న చీకటి ప్రపంచాన్ని పూర్తిగా మ్యాప్ చేసింది. 1,200కు పైగా నకిలీ డొమైన్లు: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రోత్సహించడానికి 1,200 కంటే ఎక్కువ వెబ్‌సైట్ డొమైన్లు యాక్టివ్‌గా పనిచేస్తున్నట్లు క్లౌడ్‌సెక్ గుర్తించింది. ఒక్క బ్యాకెండ్.. 25 వెబ్‌సైట్లు: పరిశోధకులు ఒక అక్రమ ప్లాట్‌ఫారమ్ అడ్మిన్ ప్యానెల్‌ను యాక్సెస్ చేయగా, కేవలం ఒకే ఒక్క బ్యాకెండ్ సిస్టమ్ నుండి 25కు పైగా వేర్వేరు బెట్టింగ్ వెబ్‌సైట్లను నడుపుతున్నట్లు తేలింది. దీని ద్వారా యూజర్ల డిపాజిట్లు, బెట్టింగులు, విత్‌డ్రా రిక్వెస్ట్‌లను నిందితులు పూర్తిగా నియంత్రిస్తున్నారు. రూ. 4.65 కోట్ల విత్‌డ్రా నిరాకరణ: మే 2025 నుండి మే 2026 మధ్య కాలంలో, ఈ ఒక్క ప్లాట్‌ఫారమ్‌లోనే వినియోగదారులు చేసుకున్న 9,300 లకు పైగా డబ్బు విత్‌డ్రా రిక్వెస్ట్‌లను ఏజెంట్లు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారు.

# ఫోర్బ్స్ బిలియనీర్స్.. జాబితాలో 229 మంది భారతీయులు!



ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రూపాయి విలువ క్షీణించినప్పటికీ భారత బిలియనీర్‌లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా-2026 ప్రకారం.. భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తుల విలువ తొలిసారి లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటడం విశేషం. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్తవారు ఈ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు. భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. మొత్తం 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలో మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఇక ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు. భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది. ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ 'ఫిజిక్స్ వాలా' కో-ఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన తమ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్ కావడంతో ఈ ఇద్దరు కుబేరుల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. ఇక ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా అరవింద్ శ్రీనివాస్ (31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న 'పెర్‌ప్లెక్సిటీ' ఏఐ సెర్చ్ స్టార్టప్ కో-ఫౌండర్ అయిన ఈయన శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత 'పేటీఎమ్' వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి పునరాగమనం చేశారు. మరోవైపు 'ఓలా క్యాబ్స్' ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తోపాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.

**భారత టాప్-10 బిలియనీర్‌లు వీళ్లే..**

1. ముకేశ్ అంబానీ - 99.7 బిలియన్ డాలర్‌లు, 2. గౌతమ్ అదానీ - 63.8 బిలియన్ డాలర్‌లు, 3. సావిత్రి జిందాల్ - 39.1 బిలియన్ డాలర్‌లు, 4. లక్ష్మీ మిట్టల్ - 31.0 బిలియన్ డాలర్‌లు, 5. శివ్ నాడార్ - 30.9 బిలియన్ డాలర్‌లు, 6. సైరస్ పూనావాలా - 27.0 బిలియన్ డాలర్‌లు, 7. దిలీప్ సంఘ్వీ - 25.6 బిలియన్ డాలర్‌లు, 8. కుమార్ బిర్లా - 21.1 బిలియన్ డాలర్‌లు, 9. రాధాకిషన్ దమానీ - 15.7 బిలియన్ డాలర్‌లు, 10. ఉదయ్ కోటక్ - 14.4 బిలియన్ డాలర్‌లు.

# నష్టాల్లో ముగిసిన భారతీయ స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 135, నిఫ్టీ 5 పాయింట్లు పతనం



భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి, 75,183.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా.. అంటే 4.30 పాయింట్లు నష్టపోయి 23,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే కొనసాగింది. సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లు పెరిగింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ చివరికి నష్టాల్లో ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని ట్రంప్ ప్రకటిండచడం ఉదయం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఆర్బీఐ రేట్లు పెంచుతుందనే భయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు వంటివి మార్కెట్ నష్టాలకు కారణాలు. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లపై ఒత్తిడి పెరగడంతో మార్కెట్ ప్రభావితమైంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు నష్టపోయాయి. అల్ట్రాటెక్, ఇండిగో, అదానీ పోర్ట్స్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభాలు చవిచూశాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4518 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు గురువారం రూపాయి స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి 63 పైసలు బలపడి 96.23కు చేరింది.

# నిరాశపరిచారు టీమిండియా సెలక్టర్లపై విమర్శలు




టీమిండియా సెలక్షన్ కమిటీ తీరును ప్రముఖ కామెంటేటర్ హర్షా భోగ్లే విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటే ఆటగాళ్లను విస్మరించడం ఎంతమాత్రం తగదన్నాడు. అఫ్గనిస్తాన్‌తో ఏకైక టెస్టుకు జమ్మూ కశ్మీర్ ఎక్స్‌ప్రెస్ ఆకిబ్ నబీని ఎంపిక చేయకపోవడం తనను తీవ్రంగా నిరాశపరిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. ఐపీఎల్-2026 ముగిసిన వెంటనే భారత జట్టు అంతర్జాతీయ క్రికెట్ (జూన్ 6 నుంచి)తో బిజీ కానుంది. ఇందులో భాగంగా తొలుత స్వదేశంలో అఫ్గనిస్తాన్ ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడనుంది. ఇందుకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్లను ప్రకటించింది.

**గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి పిలుపు**

ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినివ్వగా.. గుర్నూర్ బ్రార్ తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణతో కలిసి పేస్ దళంలో చేరాడు. అయితే, మెజారిటీ మంది విశ్లేషకులు అఫ్గన్‌తో టెస్టుకు ఆకిబ్ నబీని తప్పక ఎంపిక చేస్తారని భావించారు. కానీ సెలక్టర్లు మాత్రం అతడికి మొండిచేయి చూపారు. ఈ నేపథ్యంలో ఆకిబ్ నబీ పట్ల సెలక్షన్ కమిటీ వ్యవహారశైలిపై హర్ష్ భోగ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. "ఈ జట్టులో ఆకిబ్ నబీ తప్పక ఉంటాడని నేను విశ్వసించాను. అతడి గురించి చర్చ కూడా జరిగింది.

**అతడిని ఎందుకు ఎంపిక చేయలేదు?**

అతడి బౌలింగ్‌లో తగినంత పేస్ ఉందా? లేదా? అన్న విషయంతో నాకు సంబంధం లేదు. బౌలింగ్ చేస్తున్న సమయంలో అతడు బ్యాలెన్స్ చేసుకుంటున్నాడా? లేదా? అన్నది కూడా నాకు అక్కర్లేదు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రెండేళ్లలో అతడు వందకు పైగా వికెట్లు కూల్చాడు. అలాంటి బౌలర్‌కు ప్రోత్సాహం అందించడం కనీస బాధ్యత. అతడిని ఎంపిక చేసి ఉంటే దేశీ క్రికెట్లో సత్తా చాటే ఆటగాళ్లకు మంచి బూస్టప్ లభించేది. టెస్టుల్లో రాణించాలనే కసి మరింత పెరిగేది. అఫ్గన్‌తో టెస్టులో తుదిజట్టులో ఆకిబ్ నబీకి చోటు ఇవ్వకున్నా పర్లేదు. కానీ పదిహేను మంది సభ్యుల జట్టుకు మాత్రం అతడిని ఎంపిక చేయాల్సింది. అతడికి ఫిట్‌నెస్ సమస్యలు కూడా లేవు.

**ఏం మెసేజ్ ఇస్తు న్నారు?**

దేశీ క్రికెట్లో ఓ బౌలర్‌గా ఎంతగా రాణించాలో.. అంతా చేసి చూపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో తొమ్మిదో స్థానంలో మెరుగ్గా ఆడగలడు. అయినప్పటికీ అతడిని ఎంపిక చేయకపోవడం నిజంగా నిరాశాజనకం. ఈ సెలక్షన్ కమిటీకి ఆకిబ్ నబీని ఎంపిక చేయకపోవడానికి గల కారణాలు ఎన్నో ఉండి ఉంటాయి. కానీ వారి చర్యల ద్వారా ఇచ్చే సందేశం మాత్రం సరిగ్గా లేదు" అని హర్షా భోగ్లే యూట్యూబ్ చానెల్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్నాడు. కాగా 2025-26 సీజన్‌లో పది మ్యాచ్‌లలో ఆకిబ్ నబీ జమ్మూ కశ్మీర్ తరఫున 60 వికెట్లు తీశాడు. తన జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక అంతకుముందు సీజన్లో ఆకిబ్.. 44 వికెట్లతో సత్తా చాటాడు.

### పాండ్యాకు మ్యాచ్ ఫీజులో భారీ కోత.. ఒక డీమెరిట్ పాయింట్..!



ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నాయకుడిగా, ఆటగాడిగా దారుణంగా విఫలమైన హార్దిక్ పాండ్యాకు జరిమానా పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లఘించినందుకు అతడు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోల్పోనున్నాడు. మ్యాచ్ సమయంలో క్రికెట్ వస్తువులు(బ్యాట్, బంతి, వికెట్లు, గ్లోవ్స్, బెయిల్స్) పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు అతడికి రిఫరీ రాజీవ్ సేథ్ జరిమానా విధించాడు. అసలేం జరిగిందంటే.. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఢీకొన్నాయి. కోల్‌కతా ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్ వేసిన పాండ్యా.. నాలుగో బతికి రనప్ కోసం నడుచుకుంటూ వెళ్తూ చేతితో బెయిల్స్‌ను నెట్టేస్తున్నట్టు బలంగా తాకాడు. దాంతో, అవి కిందపడిపోయాడు. అతడి చర్యను తీవ్రంగా పరిగణించిన పాండ్యాను విచారణకు పలిచాడు రిఫరీ రాజీవ్ సేథ్. ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.2ను పాండ్యా ఉల్లంఘించాడని రిఫరీ తెలుపగా.. తాను నేరం చేశానని ముంబై కెప్టెన్ అంగీకరించాడు. దాంతో, రిఫరీ అతడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించాడు. ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించాడు. కోల్‌కతా చేతిలో ఘోర ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీజన్ ఆసాంతం పేలవ ఫీల్డింగ్ తమ కొంపముంచిందని పాండ్యా తెలిపాడు.

**రాజస్థాన్ రాయల్స్‌తో**

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 19వ సీజన్‌లో అనూహ్య తడబాటుతో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశను హ్యాట్రిక్ విజయాలతో ముగిద్దామనుకుంటే కోల్‌కతా నైట్ రెడర్స్ ముంబైని దెబ్బకొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో హార్దిక్ పాండ్యా బృందాన్ని 147కే నిలువరించిన కేకేఆర్ స్వల్ప లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి నాకౌట్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మే 24న ముంబై తలపడనుంది.


## స్పోర్ట్స్

### ఒకప్పుడు కలిసి ఆడారు.. ఇప్పుడు గురుశిష్యులుగా..!



ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందే నొవాక్ జకోవిచ్ కొత్త కోచ్‌ను నియమించుకున్నాడు. ఏడాది కాలంగా కోచ్ లేకుండానే ఆడుతున్న జొకో సెర్బియాకే చెందిన విక్టర్ ట్రాయ్‌స్కీ (ఎఅనిశీతీ ఎతీశీఱఎనిఱ)ను హెడ్‌కోచ్‌గా పరిచయం చేశాడు. ఒకప్పుడు స్నేహితులైన ఈ ఇద్దరూ ఇప్పుడు గురు శిష్యులుగా కొత్త ప్రయాణం మొదలెట్టనున్నారు. విక్టర్‌ను కోచ్‌గా తీసుకున్న విషయాన్ని బుధవారం జకోవిచ్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. రెండేళ్ల క్రితమే 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన జకోవిచ్.. 25వ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్నాడు. మే 22న 39వ వసంతంలో అడుగుపెట్టనున్న ఈ స్టార్ ఆటగాడు.. కొన్నిరోజులుగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ గెలవాలనే కసితో ఉన్నాడు. అందుకోసం.. ఈ తరం కుర్రాళ్లు జన్నిక్ సిన్నర్, అల్కరాజ్‌లను ధీటుగా ఎదుర్కొనేందుకు, తన ఆటను మరింత సానబెట్టుకునేందుకు అతడు కొత్త కోచ్‌ను నియమించుకున్నాడు. ఒకప్పుడు స్నేహితుడు, సహచరుడు అయిన విక్టర్ ట్రాయ్‌స్కీని నూతన కోచ్‌గా అందరికీ పరిచయం చేశాడు జకో. 'నా స్నేహితుడు, సహచరుడు, ఇప్పుడు కోచ్. విక్టర్ టాయ్‌స్కీకి స్వాగతం' అని ఇన్‌స్టాగ్రామ్‌లో జకోవిచ్ పోస్ట్ పెట్టాడు. రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌తో గురు శిష్యులుగా వీరిద్దరి జర్నీ మొదలవ్వనుంది. మాజీ టెన్నిస్ ఆటగాడైన విక్టర్‌కు ప్రస్తుతం 40 ఏళ్లు. జకోవిచ్‌తో కలిసి సెర్బియా జట్టుకు పదేళ్లకు పైగా కలిసి ఆడిన విక్టర్ వీడ్కోలు అనంతరం కోచ్ అవతారమెత్తాడు. జకో కోచింగ్ బృందంలో ఒకడిగా చేరిన విక్టర్.. అతడి ఒలింపిక్ పసిడి కలను సాకారం చేశాడు. ఈసారి హెడ్‌కోచ్‌గా వచ్చిన విక్టర్ తన శిష్యుడికి 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కట్టబెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. మే 24 ఆదివారం నుంచి ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమవ్వనుంది.

# రియల్ పహిల్వాన్స్.. వాళ్లను బతిమాలాల్సి వచ్చింది



మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న చిత్రం పెద్ది. ఈ మూవీ రామ్ చరణ్ డిఫరెంట్ పాత్రల్లో అభిమానులను మెప్పించనున్నారు. ఉ?ప్పెన ఫేమ్ బుచ్చిబాబు డైరెక్షన్‌లో వస్తోన్న ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఏ క్రీడ ఆడాలన్నా పెద్దినే అనే స్పోర్ట్స్ కాన్సెప్ట్ ట్రైలర్ చూస్తేనే అర్థమవుతోంది. ఈ మూవీని స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పెద్ది మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బుచ్చిబాబుతో రామ్ చరణ్ తన అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా రెజ్లర్లతో సీన్ల గురించి వివరించారు. ఇసుకలో, ఎండలో షూటింగ్ చాలా కష్టంగా అనిపించలేదా అని బుచ్చిబాబ.. చెర్రీని ప్రశ్నించారు. దీనికి రామ్ చరణ్ బదులిస్తూ నేనైతే చాలా బాగా ఎంజాయ్ చేశానని అన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేస్తే ఎలాంటి అలసట రాదన్నారు. అయితే కుస్తీలో చేయి పట్టి అదురు రావడంతో మా పాపను కూడా ఎత్తుకోలేకపోయానని తెలిపారు. మీరు నిజమైన పహిల్వాన్లను పెట్టారని రామ్ చరణ్ అన్నారు. వాళ్లు నటించమంటే.. రియల్‌గా ఆడేస్తున్నారని రామ్ చరణ్ గుర్తు చేశారు. తర్వాత మళ్లీ సారీ చెబుతున్నారని తెలిపారు. ఎందుకంటే వాళ్లలో నిజమైన స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్ అనేది వాళ్లలో ఉంటుందని చెర్రీ వివరించారు. యాక్టింగ్ చేయమంటే వారికి అది రాదని అన్నారు. కాగా.. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీలో శృతిహాసన్ స్పెషల్ సాంగ్‌లో మెప్పించనుంది.






# 'డ్రాగన్' మూవీ క్రేజీ అప్‌డేట్.. ఎన్టీఆర్ తమ్ముడిగా బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ గుప్తా!

జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్–ఇండియా యాక్షన్ ఎపిక్ 'డ్రాగన్' సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్ర కోసం మొదట మలయాళ స్టార్ హీరో టోవినో థామస్‌ను అనుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు చాలా ఎక్కువ రోజులు కాల్‌షీట్స్ కేటాయించాల్సి రావడం, దానివల్ల తన మిగతా మలయాళ ప్రాజెక్టులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో టోవినో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోగా.. అతడి పోషించే పాత్రలో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ గుప్తా నటించినట్లు తెలుస్తుంది. 'జుబిలీ', 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' వంటి వెబ్ సిరీస్‌లతో మెప్పించిన సిద్ధాంత్ గుప్తా ఈ చిత్రంతోనే టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ చిత్రంలో సిద్ధాంత్ గుప్తా 'బాబీ సర్కార్' అనే పాత్రలో కనిపించబోతుండగా.. ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీకి 'వజీర్' (ముఖ్య సూత్రధారి)గా వ్యవహరించే ఈ క్యారెక్టర్, సినిమాలో ఎన్టీఆర్ పోషిస్తున్న 'లూగర్' అనే పాత్రకు సోదరుడిగా ఉంటుందని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ అత్యంత క్రూరమైన స్మగ్లింగ్ సిండికేట్ అసోసియేట్ పాత్రలో కనిపించబోతున్నారు. అనిల్ కపూర్ రఘువీర్ రాథోడ్‌గా నటిస్తుండగా, రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. బిజు మీనన్, ఖుష్బూ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాలున్న ఈ యాక్షన్ విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.



# క్రైమ్ థ్రిల్లర్‌గా బాబీ డియోల్ 'బందర్'.. ట్రైలర్ విడుదల!

బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్ 'యానిమల్' సినిమాతో గ్లోబల్ స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకు మించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే, అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన ఆ యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తో పాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది మరియు అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రం 2026, జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.



# ఇష్టం లేకున్నా ఆ సినిమాలో నటించా.. హీరో వేణు

1999లో స్వయం వరం అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు తొట్టెంపూడి వేణు. మొదటి సినిమాతోనే మంచి సాలిడ్ హిట్ అందుకున్నాడు. హీరో గానూ ఫుల్ మార్కులు కొట్టేశాడు. ఆ తర్వాత కూడా మనసుపడ్డాను కానీ, చిరునవ్వుతో, వీడెక్కడి మొగుడండి?, హనుమాన్ జంక్షన్, కళ్యాణ రాముడు, పెళ్ళాం ఊరెళితే, ఖుషీ ఖుషీగా, చెప్పవే చిరుగాలి, సదా మీ సేవలో, అల్లరే అల్లరి, బహుమతి, గోపి గోపిక గోదావరి ఇలా పలు హిట్ సినిమాల్లో నటించాడు వేణు. రాజేంద్రప్రసాద్ తరహాలోనే కామెడీ హీరోగా తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరువయ్యాడు. ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తూనే వెంకటేష్ చింతకాలయ రవి, ఎన్టీఆర్ దమ్ము లాంటి సినిమాల్లో సహాయక నటుడిగానూ మెప్పించాడు వేణు. అయితే 2013 తర్వాత ఇండస్ట్రీకి పూర్తిగా దూరమైపోయాడు వేణు. చేసిన సినిమాలన్నీ ఫెయిల్ అవ్వడంతో కొద్దిగా గ్యాప్ తీసుకున్నాడు. అయితే 2022లో రామారావు ఆన్ డ్యూటీ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చాడీ ట్యాలెంటెడ్ హీరో. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన ఈ సినిమాలో ఆయన సీఐ మురళి అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించాడు. సినిమాలో వేణుకు స్క్రీన్ స్పేస్ బాగానే దక్కినప్పటికీ రిజల్ట్ మాత్రం దెబ్బేసింది. రామారావు ఆన్ డ్యూటీ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో తన రీఎంట్రీ ఘనంగా ప్రారంభించాలనుకున్న వేణు బాగా నిరాశ చెందాడు. అయితే రామారావు ఆన్ డ్యూటీ సినిమాపై ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశాడు వేణు తొట్టెంపూడి. ఆ చిత్ర దర్శకుడు, నిర్మాత తనను ఇబ్బంది పెట్టడం వల్లే తనకు ఇష్టం లేకపోయినా, మొహమాటానికి పోయి ఆ పాత్ర చేయాల్సి వచ్చిందని షాకింగ్ విషయం బయట పెట్టాడు' నిజానికి నేను చాలా కాలం తర్వాత వెండితెరపైకి వస్తున్నప్పుడు చాలా బెటర్ క్యారెక్టర్‌తో రావాలని ప్లాన్ చేసుకున్నాను. కానీ రామారావు ఆన్ డ్యూటీ సినిమా దర్శకుడు, నిర్మాత నన్ను తీవ్రంగా పెట్టారు. నాకు ఆ పాత్ర చేయడం అస్సలు ఇష్టం లేదు. అయినా కేవలం మొహమాటానికి పోయి ఓకే అనాల్సి వచ్చింది. ఒక్కోసారి ఇండస్ట్రీలో ఇలాంటి మొహమాటాల వల్ల సినిమాలు చేయాల్సి వస్తుంది. మూవీ సక్సెస్ అయితే ఒకే. ఫలితం తేడా కొడితే కెరీర్ మళ్లీ వెనక్కి అడుగు వేస్తుంది' అని వేణు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.



# 'పదేళ్లలో 55 ట్రాన్స్‌ఫర్స్'.. ఆసక్తిగా టీజర్

టాలీవుడ్ హీరో వడ్డే నవీన్ రీ ఎంట్రీ ఇస్తోన్న లేటేస్ట్ మూవీ ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు. అప్పట్లో పెళ్లి, మనసిచ్చి చూడు లాంటి సూపర్ హిట్స్ అందుకున్న వడ్డే నవీన్ కొన్నేళ్ల తర్వాత కనుమరుగైపోయాడు. మళ్లీ గ్రాండ్‌గా రీ ఎంట్రీ ఇస్తున్నాడు. దాదాపు పదేళ్ల విరామం హీరోగా మళ్లీ ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాకు కమల్‌తేజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో రాశీసింగ్ హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా రిలీజైన టీజర్ చూస్తుంటే ఓ కానిస్టేబుల్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి మాట వినని రెబల్ కానిస్టేబుల్‌గా పాత్రలో వడ్డే నవీన్ కనిపించనున్నట్లు టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ మూవీ జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,